సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 22.11.2026

www.mudranews.in | @mudranews


సంపుటి:14 సంచిక: 015
పేజీలు: 08 వెల: రూ. 5

3 రోజులు.. ముగ్గురు అగ్రనేతలు

బీజేపీ దూకుడు

23న కరీంనగర్‌లో నితిన్ నబీన్ పాదయాత్ర
24న తెలంగాణకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా
25న జేపీ నడ్డా పర్యటన

కరీంనగర్‌లో 2 కిలోమీటర్ల మహా పాదయాత్ర
బీజేపీ శ్రేణుల్లో అగ్రనేతల పర్యటనలతో కొత్త జోష్
మెదక్, సిద్దిపేటపై ఫోకస్



ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణలో భారతీయ జనతా పార్టీ రాజకీయ కార్యకలాపాలను మరింత వేగవంతం చేస్తోంది. రాష్ట్రంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా జాతీయ స్థాయి అగ్రనేతలు వరుసగా పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో వరుసగా 3 రోజుల పాటు కీలక నేతలు తెలంగాణకు రానుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పర్యటనలతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నెల 23న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ లో పర్యటించనున్నారు. ఎస్ఐఆర్ అంశంపై విపక్షాలు చేస్తున్న ప్రచారానికి కౌంటర్‌గా ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు పార్టీ చేపట్టిన 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హఠావో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే మహా పాదయాత్రలో ఆయన పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న నితిన్ నబీన్.. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటారు. అనంతరం నేరుగా కరీంనగర్ వైశ్యా భవన్‌కు చేరుకుని మహా పాదయాత్రలో పాల్గొంటారు. వైశ్యా భవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రీ రోడ్డు మీదుగా కమాన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జీలు రేఖా శర్మ, అభయ్ పాటిల్ తదితర నేతలు పాల్గొననున్నారు. **మిగతా 02లో**

పాక్‌కు చైనా అండ!

ఆపరేషన్ సింధూర్‌లో చైనా కుట్ర

- భారత్ ఎదుగుదలను తట్టుకోలేక పాకిస్తాన్ కు చైనా సహాయం
- తన ఆర్థిక రంగాన్ని ఆయుధంగా మారుస్తున్న డ్రాగన్ కంట్రీ
- భారత్, అమెరికా మధ్య సన్నిహిత సంబంధాలు పెరగాలి..
- అమెరికా కాంగ్రెస్ కీలక నివేదిక..



2

ఏరోస్పేస్ రంగంలో ₹4వేల కోట్ల పెట్టుబడి!

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

- సఫ్రాన్ సంస్థ భారీ పెట్టుబడి ప్రతిపాదన..
- డిసెంబర్‌లో ఎంఓయూ కుదిరే అవకాశం
- ఫ్రాన్స్‌లో సఫ్రాన్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన



కోటి కుటుంబాలకు 'బీమా'

₹5 లక్షల భరోసా

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణలో కోటి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా అందించేలా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతోపాటు, ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల జీవిత బీమా మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. ఇప్పటికే అమల్లో ఉన్న రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కూడా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తు ఫారాలను విడుదల చేయనున్నారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల నమోదు ప్రక్రియ కొనసాగనుంది. అయితే ఈ పథకం ఎవరికి వర్తిస్తుంది? కుటుంబంలో ఎంతమందికి బీమా లభిస్తుంది?

- ఇందిరమ్మ జీవిత బీమాతో ఎంతో ప్రయోజనం
- 18-59 ఏళ్ల సంపాదించే వ్యక్తులకు అవకాశం..
- కుటుంబంలో ఒక్కరికే బీమా వర్తింపు..
- నవంబర్ 19 నుంచి దరఖాస్తుల స్వీకరణ..
- ప్రమాద బీమా రూ.10 లక్షలు యథాతథం



దరఖాస్తు ఎలా చేసుకోవాలి? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.


కుటుంబంలో ఒక్కరికే..
ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబంలోని సంపాదించే వ్యక్తుల్లో ఒక్కరికి మాత్రమే బీమా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది సంపాదిస్తున్నప్పటికీ.. వారిలో ఎవరికి బీమా చేయించుకోవాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు. బీమా నమోదు చేసుకున్న వ్యక్తి మరణిస్తే సంబంధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందుతుంది. తద్వారా కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరును కోల్పోయిన సమయంలో ఆర్థికంగా కొంత భరోసా లభించనుంది.

18 నుంచి 59 ఏళ్ల వారికి అర్హత
ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసున్న సంపాదించే వ్యక్తులు అర్హులు. అంటే 1967 నవంబర్ 19 నుంచి 2008 నవంబర్ 18 మధ్య జన్మించిన వారు నమోదు చేసుకోవచ్చు. వయసు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన జన్మ తేదీనే ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఒకసారి బీమా నమోదు పూర్తయిన తర్వాత లబ్ధిదారుడు గరిష్ఠ వయోపరిమితిని దాటినా కనీసం మరో ఏడాది పాటు బీమా రక్షణ కొనసాగనుంది. **మిగతా 02లో**

సవాళ్లు ఎదుర్కోకుండా బతకలేను

ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పీఎం మోదీ!

- సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోవాలి
- దేశ ప్రగతిని అడ్డుకునే పెద్ద అవరోధం మనసులోని పరిమితులే
- కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమిస్తూ వస్తోంది
- 50 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని వెల్లడి



2

చరిత్రలో నిలిచిపోయేలా

మహా పాదయాత్ర


- లక్ష మందికిపైగా జనం వచ్చేలా రవాణా ఏర్పాట్లు పూర్తి
- కరీంనగర్ గాంధీ విగ్రహం నుండి కమాన్ చౌరస్తా వరకు
- వైశ్యా భవన్ వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న నితిన్ నబీన్



3

రాజగోపాల్ రెడ్డికి అధిష్టానం ఫోన్

రేవంత్‌పై విమర్శలతో అధిష్టానం సీరియస్!



2

- రాజగోపాల్ రెడ్డికి హైకమాండ్ పిలుపు
- అసంతృప్తికి చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్లాన్?
- కొత్త ఇన్‌ఛార్జితో 23న కీలక భేటీ
- రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై అధిష్టానం ఆరా?

60 ఏళ్ల తర్వాత

నిజరూపంలో కొండగట్టు అంజన్న

- చందనం వీడిన కొండగట్టు హనుమాన్
- 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి అసలు రూప దర్శనం
- డిసెంబర్ 29 వరకు దర్శనభాగ్యం
- పట్టువస్త్రాలతో అంజన్నకు ప్రత్యేక అలంకరణ
- స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేల దర్శనం





ముద్ర, కరీంనగర్ :
తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అరుదైన ఆధ్యాత్మిక ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు 60 ఏళ్ల తర్వాత స్వామివారి మూలవిరాట్‌పై పేరుకుపోయిన చందనం, సింధూరం పొరను తొలగించడంతో అంజన్న స్వామి నిజరూపం భక్తులకు దర్శనమిస్తోంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు భక్తులు స్వామివారి అసలు రూపాన్ని దర్శించుకునే అవకాశం కల్పించారు.

ఏమిటి ఈ నిజరూప దర్శనం?
ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రతి మంగళవారం, శనివారం స్వామివారి మూలవిరాట్‌కు చందనం, సింధూరం పూసి పూజలు నిర్వహిస్తారు. ఇలా ఏళ్ల తరబడి చందనం పూయడంతో విగ్రహంపై మందపాటి పొర ఏర్పడింది. చివరిసారిగా 1965లో ఈ పొరను తొలగించగా, మళ్లీ ఈ ఏడాది నవంబర్ 15 నుంచి 20 వరకు ప్రత్యేక క్రతువులు నిర్వహించి సుమారు 99 కిలోల చందనాన్ని తొలగించారు. దీంతో ఆరు దశాబ్దాల తర్వాత స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తోంది.

ప్రత్యేక పూజలు.. పవిత్ర అభిషేకాలు
చందనపు పొరను బంగారం, వెండి, చెక్కతో తయారు చేసిన ప్రత్యేక ఉపకరణాలతో జాగ్రత్తగా తొలగించారు. అనంతరం పవిత్ర నదులు, సముద్ర జలాలతో అభిషేకం నిర్వహించి, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి తీసుకొచ్చిన పట్టువస్త్రాలతో స్వామివారిని **మిగతా 02లో**

బ్రాండ్ హైదరాబాద్ ను

దెబ్బతీస్తున్నారు


మెటాపై దాడితో తీవ్ర నష్టం

5

- కాంగ్రెస్ యువజన నేతల తీరుపై కేటీఆర్ ఆగ్రహం
- గూండాయిజంతో పెట్టుబడులు వస్తాయా?
- రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్
- మెటా ఘటనపై కాంగ్రెస్ ను టార్గెట్ చేసిన బీఆర్ఎస్




ఇదీ AI ముద్ర



వైఎస్‌తో ఈ సమస్య రాలేదు

పెళ్లికి ఆహ్వానిస్తే ఇంత నీచపు రాతలు అవసరమా?

- షర్మిల కుమార్తె పెళ్లికి తనను ఆహ్వానించడంపై కథనాలు
- సాక్షి పత్రికపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం
- వైసీపీది విధ్వంసకర చరిత్ర అని విమర్శ



2



షర్మిలపై కోర్టుకెక్కిన జగన్

యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల ప్రవేశాన్ని అడ్డుకోవాలని కోర్టులో పిటిషన్

2


- సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్ పేరిట దేవనహళ్లి కోర్టును ఆశ్రయించిన జగన్
- ఆస్తి అత్తగారు సుగుణమ్మ పేరిట ఉందని వాదన
- 'సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్' పేరిట భీమిశెట్టి రమేశ్ బాబు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు
- కుమార్తె పెళ్లి కార్డు ఇచ్చేందుకు బెంగళూరు వెళ్లనున్న షర్మిల

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

ఆదివారం,
22 నవంబర్, 2026

అధిక బరువును తగ్గించుకోండి

మెడ చుట్టూ కొవ్వు పేరుకుపోవడం శ్వాస మార్గానికి అడ్డంకిగా మారవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతో బరువు తగ్గండి.



వైఎస్‌తో ఈ సమస్య రాలేదు

ముద్ర, అమరావతి :

సాక్షి పత్రిక బాధ్యతారహితంగా వార్తలు రాస్తోందని, వైసీపీ తీరు రాష్ట్రానికి హాని చేసేలా ఉందని సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా విధ్వంసమే ఆ పార్టీ చరిత్ర అని, అందుకే దానిని "గొడ్డలి పార్టీ" అని పిలవాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ షర్మిల కుమార్తె వివాహానికి తనను ఆహ్వానించడంపై సాక్షి పత్రికలో వచ్చిన కథనాల పట్ల చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇంటికి వచ్చి పెళ్లికి పిలిస్తే సొంత చెల్లిపైనే అసభ్యంగా రాస్తారా? షర్మిల తన కుమార్తె పెళ్లికి నన్ను పిలిచారు. దీనిపై ఇంత నీచపు రాతలు అవసరమా? రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలు వేరనే కనీస అవగాహన కూడా లేదా?" అని ఆయన ప్రశ్నించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో తనకున్న స్నేహాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'రాజశేఖర రెడ్డి, నేను మంచి స్నేహితులం. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ మా వ్యక్తిగత సంబంధాలు ఎన్నడూ చెడిపోలేదు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు షర్మిల, జగన్ ఇద్దరి పెళ్లిళ్లకూ నన్ను పిలిచారు, నేను హాజరయ్యాను. సంబంధాలను ఇంత దారుణంగా కించపరుస్తారా?" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రానికి పెట్టుబడులు రావడం చూసి వైసీపీ ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు.

షర్మిలపై కోర్టుకెక్కిన జగన్



ముద్ర, అమరావతి :

వైఎస్ కుటుంబంలో ఆస్తుల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. బెంగళూరులోని యలహంక ప్యాలెస్ (నివాసం)లోకి తన సోదరి వైఎస్ షర్మిల ప్రవేశించకుండా నిరోధించాలని కోరుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు బెంగళూరులోని దేవనహళ్లి కోర్టులో 'సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్' పేరిట భీమిశెట్టి రమేశ్ బాబు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు.

కొంత కాలంగా యలహంక ప్యాలెస్ కేంద్రంగా వివాదం నడుస్తోంది. తొలుత షర్మిల తన కుమార్తె అంజలి రెడ్డి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లోనే నిర్వహించాలని భావించారు. అయితే, భద్రతా కారణాలను చూపుతూ జగన్ అందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో షర్మిల వివాహ వేదికను మార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, తన కుమార్తె వివాహానికి జగన్‌ను స్వయంగా ఆహ్వానించేందుకు, అలాగే అక్కడ బస చేసేందుకు షర్మిల కుటుంబ సమేతంగా ఆదివారం బెంగళూరుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే జగన్ వర్గం అప్రమత్తమై న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.

ఈ ఆస్తిపై జగన్ తన వైఖరిని స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారు. యలహంక నివాసం తన అత్తగారైన సుగుణమ్మకు చెందినదని, దీనిపై షర్మిలకు ఎటువంటి హక్కులు లేవని ఆయన స్పష్టం చేస్తున్నారు. షర్మిల నేరుగా ప్యాలెస్‌కు వస్తే భద్రతా సిబ్బందితో అడ్డుకోవడం ద్వారా అనవసర రాజకీయ దుమారం చెలరేగే అవకాశం ఉందని భావించిన జగన్, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేందుకే చట్టబద్ధంగా కోర్టు ద్వారా ఇంజంక్షన్ ఆర్డర్ కోరినట్లు తెలుస్తోంది.

ఈ పిటిషన్ దాఖలు కావడంతో వైఎస్ కుటుంబ అంతర్గత విభేదాలు మరోసారి తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ పిటిషన్‌పై కోర్టు ఏ విధమైన నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పాక్‌కు చైనా అండ!

ముద్ర, న్యూఢిల్లీ :

అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని అమెరికా కాంగ్రెస్‌కు చెందిన యూఎస్-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ తన తాజా నివేదికలో సూచించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్తాన్‌కు సాంకేతిక, సైనిక సహకారం అందించిందని వెల్లడించింది. భారత్ ఎదుగుదలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఒత్తిడి పెంచడంతో పాటు, కీలక పారిశ్రామిక ముడి పదార్థాలు, పరికరాల సరఫరాపై ఆంక్షలు విధిస్తోందని పేర్కొంది.

2025 మేలో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మూడు రోజుల సైనిక ఘర్షణను ప్రస్తావించిన కమిషన్.. చైనా నేరుగా యుద్ధంలో పాల్గొనకుండానే పాక్‌కు అండగా నిలిచిందని తెలిపింది. జే-10సీ ఈ యుద్ధ విమానాల పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు తమ ఇంజనీర్లు సాంకేతిక సహకారం అందించినట్లు చైనా ఇంజనీర్ జాంగ్ హెంగ్ వెల్లడించిన అంశాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. పాకిస్తాన్‌తో చైనా సైనిక భాగస్వామ్యం భారత్‌కు రెండు వైపుల నుంచి భద్రతా ముప్పును పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఆర్థికంగానూ ఒత్తిడి

భారత్ పారిశ్రామిక రంగం ఎదుగుదలను నియంత్రించేందుకు కీలక ముడి పదార్థాలు, సాంకేతిక పరికరాల సరఫరాను చైనా ఆయుధంగా ఉపయోగించుకుంటోందని నివేదిక పేర్కొంది. ఇంజనీర్లను వెనక్కి పిలవడం, ఎగుమతులపై పరిమితులు విధించడం వంటి చర్యలతో భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై ప్రభావం చూపే ప్రయత్నం చేస్తోందని తెలిపింది.

మరోవైపు భారత్ సైనిక సామర్థ్యాన్ని ఆధునీకరిస్తూ, దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేసుకుంటోందని ప్రశంసించింది. అమెరికా, ఇతర దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను విస్తరించాలని సూచించింది. రక్షణ సాంకేతికత, నిఘా సమాచారం, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో భారత్‌తో అమెరికా సహకారాన్ని మరింత పెంచుకోవాలని కమిషన్ సిఫార్సు చేసింది. అయితే చైనా యంత్రాలు, విడిభాగాలపై భారత్ ఆధారపడటం తగ్గించుకోవడానికి భారీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, సమయం అవసరమని నివేదిక అభిప్రాయపడింది.



కోటి కుటుంబాలకు 'బీమా'

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక శిబిరాలు

అర్హులైన వారందరికీ ఈ పథకాన్ని చేరువ చేసేందుకు గ్రామాలు, పట్టణాలు, వార్డుల స్థాయిలో ప్రత్యేక సహాయక నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో వార్డు అధికారులు ఈ శిబిరాల నిర్వహణ బాధ్యతలు చేపడతారు. ఆహార భద్రత కార్డుల డేటా ఆధారంగా కుటుంబాల వివరాలను సేకరించి నమోదు ప్రక్రియ చేపడతారు.

రేషన్ కార్డులు ఉన్నవారు వాటి వివరాల ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ప్రత్యేక దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచనున్నారు. బీమా పొందే వ్యక్తి వివరాలు, ఆధార్ సమాచారం, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీ వివరాలను దరఖాస్తులో నమోదు చేయాల్సి ఉంటుంది.

నామినీలకు వాటాలపై ముందస్తు స్పష్టత

ఈ పథకంలో నామినీల నమోదు కూడా కీలకంగా ఉండనుంది. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొంటే.. రూ.5 లక్షల బీమా మొత్తంలో ఒక్కొక్కరికి ఎంత వాటా అందుతుందనే విషయాన్ని దరఖాస్తు సమయంలోనే అధికారులు స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. దీనివల్ల భవిష్యత్తులో బీమా క్లెయిమ్ సమయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని భావిస్తున్నారు.

ఇతర జిల్లాలకు చెందిన రేషన్ కార్డులు ఉన్నవారు కూడా తమకు సమీపంలోని నమోదు శిబిరాల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ప్రజలకు ఎదురయ్యే సందేహాలు, సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో హెల్ప్ డెస్క్‌తోపాటు జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

కోటి కుటుంబాలకు ఆర్థిక భరోసా సాధ్యమేనా?

ఇప్పటికే వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా బీమా ప్రయోజనాలు పొందుతున్న వారిని మినహాయించకుండా, అర్హులైన కుటుంబాలన్నింటికీ ఒకే విధమైన జీవిత బీమా భద్రత కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశం. రూ.2 లక్షలుగా ఉన్న జీవిత బీమాను రూ.5 లక్షలకు పెంచడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయంగా చెప్పవచ్చు. అయితే కోటి కుటుంబాలకు ఈ పథకాన్ని చేరవేయడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ నమోదు చేయడం, బీమా క్లెయిమ్‌లను సకాలంలో పరిష్కరించడం ప్రభుత్వానికి కీలక సవాలుగా మారనుంది. మొత్తంగా కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుప్పకూలకుండా అండగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ముందుకు తీసుకొస్తోంది. క్షేత్రస్థాయిలో నమోదు ప్రక్రియ ఎంత సమర్థంగా సాగుతుంది? అర్హులైన కోటి కుటుంబాలకు బీమా రక్షణ ఏ మేరకు అందుతుంది? అన్నది వేచి చూడాలి.



బీజేపీ దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

ఇక ఈ నెల 24న కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు రానున్నారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నట్లు సమాచారం. మరోవైపు కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత జేపీ నడ్డా ఈ నెల 25న రాష్ట్రంలో పర్యటించే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మెదక్ లేదా సిద్దిపేటలో నిర్వహించనున్న పాదయాత్రలో ఆయన పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే నడ్డా పర్యటనపై షెడ్యూల్ కావాల్సి ఉంది.

మూడు రోజుల వ్యవధిలో జాతీయ స్థాయి అగ్రనేతలు తెలంగాణకు రానుండటంతో రాష్ట్ర బీజేపీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కనున్నాయి. ముఖ్యంగా కరీంనగర్, మెదక్, సిద్దిపేట ప్రాంతాలపై పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. అగ్రనేతల పర్యటనలను పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు బీజేపీ ఉపయోగించుకోనుంది. వరుస పర్యటనలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది చూడాలి.

రాజగోపాల్ రెడ్డికి అధిష్టానం ఫోన్

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఫోన్ కాల్ రావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ స్వయంగా రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్‌తో సమావేశం కావాలని సూచించారు. 23వ తేదీన వీరిద్దరూ కీలక భేటీ అవుతారు. కొత్త ఇన్‌ఛార్జి బీఎం సందీప్ బాధ్యతలు తీసుకున్న వెంటనే.. అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్న రాజగోపాల్ రెడ్డితో భేటీ అవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై అధిష్టానం వివరణ కోరుతుందా..? లేక పార్టీలో అంతర్గత సమన్వయం కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేశారా..? అనే దానిపై నల్గొండ జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. ఈ నెల 23న జరిగే సమావేశం తర్వాత దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

సవాళ్లు ఎదుర్కోకుండా బతకలేను

ముద్ర, న్యూఢిల్లీ :

సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు.

ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతిచ్చామని చెప్పారు. ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. 75 ఏళ్ల కాలంలో భారత్ ఎద్దుబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు.

అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు.

సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.



తెలంగాణకు ఏరోస్పేస్ రంగంలో రూ.4వేల కోట్ల పెట్టుబడి!

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణలో ఏరోస్పేస్, విమాన విడిభాగాల తయారీ రంగాన్ని మరింత విస్తరించే దిశగా మరో కీలక పెట్టుబడి ప్రతిపాదన ముందుకొచ్చింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తెలంగాణలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనకు సంబంధించి డిసెంబర్ 2026లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరే అవకాశం ఉంది.

ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం పారిస్ సమీపంలోని ఎవ్రీ-కార్బెల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమై తెలంగాణలో కొత్త పెట్టుబడులు, ప్రస్తుత కార్యకలాపాల విస్తరణ, అదనపు తయారీ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు.

ప్రపంచ వ్యాప్తంగా బోయింగ్, ఎయిర్‌బస్ వంటి విమాన తయారీ సంస్థలకు ఇంజిన్లను సరఫరా చేస్తున్న సఫ్రాన్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో పలు కార్యకలాపాలు నిర్వహిస్తోంది. లీప్ విమాన ఇంజిన్లకు అవసరమైన రొటేటింగ్ పార్ట్స్ తయారీ కేంద్రం, సఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ తయారీ యూనిట్‌తో పాటు విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులకు ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రాల్లో ఒకటైన లీప్ ఎంఆర్ఓ సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వేగంగా అనుమతులు కల్పించే పారిశ్రామిక విధానాలు తెలంగాణకు ప్రధాన బలమని వివరించారు. సఫ్రాన్ ప్రతినిధులతో సమావేశం ఫలప్రదంగా సాగిందని, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంస్థ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు.



సఫ్రాన్ అంతర్జాతీయ కార్యకలాపాలు, పౌర, సైనిక విమానాల ఇంజిన్ల రూపకల్పన, తయారీ, నిర్వహణ విధానాలను సంస్థ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం తయారీ విభాగాన్ని సందర్శించిన ఆయన విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీ, అసెంబ్లీ ప్రక్రియలను పరిశీలించారు.

ఈ పర్యటనలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, సఫ్రాన్ సంస్థ ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లారెంట్ మజౌ, ఇండస్ట్రియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రొటేటింగ్ పార్ట్స్ డైరెక్టర్ జూలియన్ డి'ఒరాజియో పాల్గొన్నారు.

రూ.4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను ఖరారు చేసేందుకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ సఫ్రాన్ ప్రతినిధులతో తదుపరి చర్చలు జరపనుంది. ఈ పెట్టుబడి కార్యరూపం దాల్చితే తెలంగాణలో ఏరోస్పేస్ తయారీ రంగం విస్తరించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

60 ఏళ్ల తర్వాత

(మొదటి పేజీ తరువాయి)

అలంకరించారు. తొలగించిన చందనాన్ని హుండీలో భద్రపరిచి, అనంతరం సింధూరంలో కలిపి భక్తులకు అందించనున్నారు.

500 ఏళ్ల చరిత్ర కలిగిన క్షేత్రం

కొండగట్టు అంజన్న ఆలయానికి సుమారు 500 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు స్థల పురాణం చెబుతోంది. అటవీ ప్రాంతంలో సింగం బాలయ్యకు స్వామివారి ఉనికి తెలిసిందని, అనంతరం ఆయన తల్లిదండ్రులు సంజీవుడు, ఆశమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని ప్రతీతి. ఆరోగ్యం, సంతాన ప్రాప్తి, కుటుంబ శ్రేయస్సు కోసం భక్తులు అంజన్నను విశేషంగా కొలుస్తారు.

డిసెంబర్ 29 వరకు అరుదైన అవకాశం

సాధారణంగా చందనంతో అలంకరించి దర్శనమిచ్చే కొండగట్టు అంజన్న స్వామి ఇప్పుడు నిజరూపంలో భక్తులకు కనువిందు చేస్తున్నారు. 40 రోజుల దర్శన కాలం ముగిసిన అనంతరం మండలాభిషేకం నిర్వహించి తిరిగి చందన విలేపనాలు ప్రారంభించనున్నారు.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.11.2026
www.mudranews.in | @mudranews

లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించండి

బిగ్గరగా గురక, నిద్రలో శ్వాస ఆగడం, ఉదయం తలనొప్పి, పగటిపూట నిద్రమత్తు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా స్లీప్ అప్నియా పరీక్షలు చేయించుకోండి.



ఒకే ఇంట్లో ఎమ్మెల్యే.. జడ్పీ చైర్‌పర్సన్!

*** ఏపీలో ఆసక్తికర రాజకీయ పరిణామాలు**
*** తండ్రి ఎమ్మెల్యే.. కుమార్తె జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక**
*** పరిటాల కుటుంబంలో ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పదవులు**
*** మరో చోట ఎమ్మెల్యే తండ్రికి, ఇంకోచోట సోదరుడికి జడ్పీ పీఠం**
*** ఒకే కుటుంబంలో కీలక ప్రజాప్రతినిధులుగా ఇద్దరు**

ముద్ర, అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ల ఎన్నికల సందర్భంగా ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్ వంటి కీలక పదవులను చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీ ఏలూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. దీంతో ఒకే కుటుంబంలో తండ్రి ఎమ్మెల్యేగా, కుమార్తె జడ్పీ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టినట్లయింది. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కుమారుడు పరిటాల శ్రీరామ్ సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. దీంతో పరిటాల కుటుంబంలోనూ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పదవులు ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు ప్రజాప్రతినిధుల హోదాల్లో ఉండటం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీస్తోంది.

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

ప్రజల తీర్పు పాలనకు గుర్తింపు

ముద్ర, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు అద్భుతమైన విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. జెడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో సాధించిన ఫలితాలు తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ప్రతిఫలంగా భావిస్తున్నామని తెలిపారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోనూ కూటమికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూటమి 96.42 శాతం, ఎంపీపీల్లో 93.15 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందని వెల్లడించారు. ఎన్డీఏకు 58.90 శాతం ఓట్లు రాగా, వైసీపీ ఓట్ల శాతం 33.56కు పడిపోయిందని వివరించారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం, యువతకు ప్రాధాన్యం, విద్యార్హతలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. బీసీలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు జనాభా దామాషా ప్రకారం పదవుల్లో భాగస్వామ్యం కల్పించామన్నారు. 22 జెడ్పీ చైర్‌పర్సన్ పదవుల్లో 12 మహిళలకు, 20 వైస్ చైర్‌పర్సన్ పదవుల్లో 11 మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. పలువురు గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. సామాన్య కార్యకర్తలకు సైతం కీలక పదవులు ఇచ్చి పార్టీ పట్ల వారి అంకితభావాన్ని గుర్తించామని తెలిపారు. పల్నాడులో యాదవ వర్గానికి చెందిన పుచ్చకాయల రమాదేవి, తూర్పుగోదావరిలో శెట్టి బలిజ వర్గానికి చెందిన కాడ పద్మకు జెడ్పీ చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించామని వివరించారు. పార్టీ కార్యకర్తే అధినేత అన్న సిద్ధాంతంతో పనిచేస్తూ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించడమే తమ విజయానికి ప్రధాన కారణమని చంద్రబాబు పేర్కొన్నారు.

చిన్న వయసులోనే చెస్‌లో ప్రపంచ రికార్డులే లక్ష్యం

చిన్నారుల ప్రతిభను అభినందించిన అజయ్ మిశ్రా, దుంద్ర కుమారస్వామి



ముద్ర, హైదరాబాద్: చిన్న వయసులోనే చదరంగంపై ఆసక్తి పెంచుకుని ప్రపంచ రికార్డుల దిశగా అడుగులు వేస్తున్న చిన్నారుల ప్రతిభ అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. చెస్ పిల్లల్లో ఏకాగ్రత, సహనం, ముందుచూపు, వ్యూహాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని ఆకాంక్షించారు.

బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్, డైమండ్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గేట్‌వే కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ రికార్డు కార్యక్రమంలో మూడేళ్ల సయాన్స్, నాలుగేళ్ల ఇషిక, ఏడేళ్ల చైత్ర, తొమ్మిదేళ్ల మణి అస్రిత్, విహాన్ తమ చెస్ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన అజయ్ మిశ్రా, దుంద్ర కుమారస్వామి చిన్నారులను అభినందించారు.

ప్రపంచ రికార్డుల సాధనలో వయసు అడ్డంకి కాదని చిన్నారులు నిరూపిస్తున్నారని కుమారస్వామి అన్నారు. రికార్డుల కంటే నిరంతర సాధన, క్రమశిక్షణ, కోచ్‌ల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ముఖ్యమని తెలిపారు. పిల్లలపై రికార్డుల పేరుతో ఒత్తిడి తీసుకురాకుండా వారి ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ నరేష్ రెడ్డి, డాక్టర్ వినయ్, చిన్నారుల తల్లిదండ్రులు, చెస్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం



ముద్ర, హైదరాబాద్ : ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 21న గాంధీభవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి న ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొని రక్తదానం చేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా నితిన్ నబీన్ 'మహా పాదయాత్ర'కు ఏర్పాట్లు

- లక్ష మందికిపైగా జనం వచ్చేలా రవాణా ఏర్పాట్లు పూర్తి
- కరీంనగర్ గాంధీ విగ్రహం నుండి వైశ్యా భవన్, టవర్ సర్కిల్, గంజ్, గడియారం సర్కిల్, శాస్త్రీరోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు పాదయాత్ర
- వైశ్యా భవన్ వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న నితిన్ నబీన్
- మహా పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ మండలాధ్యక్షులు, ఇంఛార్జీలతో భేటీ



ముద్ర, కరీంనగర్ : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఈనెల 23న కరీంనగర్ కు రానున్న నేపథ్యంలో పర్యటన విజయవంతంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ద్రుష్టి సారించారు. ''సర్'' పేరుతో రాజ్యాంగ సంస్థలపై దాడులు చేస్తూ దేశ ప్రతిష్టకు కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు భంగం కలిగిస్తున్న నేపథ్యంలో ''ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం– అరాచకాన్ని అంతం చేద్దాం'' విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగనుంది. అందులో భాగంగా నితిన్ నబీన్ ''మహా పాదయాత్ర'' చేయనున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా నితిన్ నబీన్ మహాపాదయాత్రను విజయవంతం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి లక్ష మందికిపైగా జనాన్ని సమీకరించి నితిన్ నబీన్ తోపాటు ''మహా పాదయాత్ర'' నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. కరీంనగర్ గాంధీ విగ్రహం నుండి వైశ్యా భవన్, టవర్ సర్కిల్, గంజ్, గడియారం సర్కిల్, శాస్త్రీరోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు దాదాపు రెండున్నర కిలోమీటర్లకుపైగా 'మహా పాదయాత్ర' జరిగేలా రూట్ మ్యాప్ రూపొందించారు.

ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర సహ సంఘటనా కార్యదర్శి దశరథ్, బీజేపీ జిల్లా ఇంఛార్జీ బండారి శాంతికుమార్, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి వైశ్యా భవన్ వద్దకు వెళ్లారు. మహా పాదయాత్ర రూట్ ను పరిశీలించారు. వైశ్యా భవన్ వద్ద నితిన్ నబీన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అక్కడ స్టేజీ, ఇతర ఏర్పాట్లపై నేతలతో చర్చించారు. అనంతరం కరీంనగర్ పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. కనీవినీ ఎరగని రీతిలో మహా పాదయాత్రకు ప్రజలు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని పోలీసులను కోరారు. మహా పాదయాత్ర కు వచ్చే కార్యకర్తలు, ప్రజలకు రవాణా ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు దాదాపు వెయ్యి బస్సులు, 2 వేల ఆటోలతోపాటు వందలాది మినీ బస్సులను కూడా సమకూరుస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు వేలాది కార్లలోనూ నాయకులు కరీంనగర్ పాదయాత్రకు వస్తున్నట్లు చెప్పారు. జిల్లాలు, మండలాలు, నియోజకవర్గాల నుండి వచ్చే బస్సులు, ఆటోలు, వాహనాల, కార్ల పార్కింగ్ కు ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసులను సూచించారు. దీంతోపాటు నితిన్ నబీన్ పాదయాత్ర సందర్భంగా తొక్కిసలాట లేకుండా జనం మధ్యలోనుండి పాదయాత్ర చేసుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కోరారు.

అనంతరం జన సమీకరణ, మహా పాదయాత్ర ఏర్పాట్లు, అలంకరణ, హోర్డింగులు, ఫ్లెక్సీల ఏర్పాట్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ రోజంతా పార్టీ నేతలతో వరుస భేటీలు నిర్వహించారు. తొలుత ఎంపీ కార్యాలయంలో సిరిసిల్ల జిల్లా నేతలతో సమావేశం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా నాయకులతోనూ మాట్లాడారు.

అనంతరం నగరంలోని కొండా సత్యలక్ష్మీ గార్డెన్ లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మండలాధ్యక్షులు, మండల ఇంఛార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ సంఘటన ఇంఛార్జీ దశరథ్, కరీంనగర్ జిల్లా ఇంఛార్జీ బండారి శాంతికుమార్, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపీ, సంజీవరెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ సీనియర్ నేతలు బొమ్మ జయశ్రీ, ఓదెలు, గంగాడి క్రిష్ణారెడ్డి, బాస సత్యనారాయణ, మోహన్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ సంఘటన కార్యదర్శి దశరథ్ జీ మాట్లాడుతూ హైదరాబాద్ లో అమిత్ షా పర్యటన విజయవంతం కావడంతోనే కాంగ్రెస్ పార్టీకి శవ పేటిక రడీ చేసినట్లయిందని అన్నారు. ఈనెల 23న కరీంనగర్ లో నితిన్ నబీన్ పర్యటనను విజయవంత మయ్యాక కాంగ్రెస్ పార్టీని సమాధి చేసేందుకు సిద్ధమైనట్లేన ని చెప్పారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని, అందులో భాగంగా నిర్వహించే కరీంనగర్ నితిన్ నబీన్ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని తెలిపారు. అంచనాలకు మించి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ నితిన్ నబీన్ పర్యటనను కనీవినీ ఎరగని రీతిలో చరిత్ర సృష్టించడంతోపాటు దేశమంతా చర్చ జరిగేలా విజయవంతం చేయాలని పార్టీ నేతలను కోరారు. మహాపాదయాత్ర ఆద్యంతం సర్ కు మద్దతుగా నిలవడంతోపాటు వందేమాతరం, భారత్ మాతాకీ జై నినాదాలతో కరీంనగర్ దద్దరిల్లాలని కోరారు. ఫ్లెక్సీలు, హోర్డింగులు, కాషాయ జెండాలతో నితిన్ నబీన్ కు ఘన స్వాగతం పలకడంతోపాటు కరీంనగర్ ను కాషాయ మయం చేయాలని కోరారు. ''నాకు అందిన సమాచారం మేరకు దాదాపు లక్ష మందికిపైగా జనం, కార్యకర్తలు పాదయాత్రకు వస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన చేసుకోండి. మహా పాదయాత్ర కు వచ్చే వారికి రవాణా, భోజన, నీటి వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. సరిపడా మజ్జిగ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ''మహా పాదయాత్ర గాంధీ విగ్రహం వద్ద నుండి ప్రారంభమవుతుంది. ప్రతి ఒక్కరూ గాంధీ బొమ్మ వద్దకు చేరుకోవాలి. అటు నుండి వైశ్యా భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, గడియారం సర్కిల్, శాస్త్రీరోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు పాదయాత్ర కొనసాగుతుంది. మహాపాదయాత్రకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ పాదయాత్ర పూర్తయ్యే వరకు నితిన్ నబీన్ తో కలిసి అడుగులో అడుగు వేయాలి'' అని కోరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిపై సమగ్ర విచారణ

దోచుకున్న ప్రజాధనాన్ని తిరిగి వసూలు చేస్తాం: రాంచందర్ రావు

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమగ్ర విచారణ జరిపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రకటించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారి నుంచి ప్రతి పైసాను తిరిగి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లకు చేరాయని, ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దకుండా ప్రభుత్వ భూములను విక్రయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లోని మెటా కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించిన ఆయన.. ఇలాంటి ఘటనలు రాష్ట్రానికి పెట్టుబడులు రావడంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలపై అభ్యంతరాలుంటే చట్టపరంగా పోరాడాలే తప్ప కార్యాలయాలపై దాడులు చేయడం సరికాదన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని, రైతులు మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. విద్యారంగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీ బలపడుతుండటంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని రాంచందర్ రావు వ్యాఖ్యానించారు.

విద్యుత్ రంగంలో ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ముద్ర, హైదరాబాద్ : విద్యుత్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, నాణ్యమైన పరికరాల తయారీకి పరిశ్రమలు ప్రాధాన్యత ఇవ్వాలని TGSPDCL సీఎండీ జితేష్ వి. పాటిల్ సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ELECRAMA 2027 రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, ఈ ఏడాది అక్టోబర్‌లో 20,018 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైందని తెలిపారు.

డీపీఆర్‌లో డయాఫ్రమ్ వాల్.. క్షేత్రస్థాయిలో సీకెంట్ పైల్స్

ఇదే కాళేశ్వరం వైఫల్యానికి ప్రధాన కారణం
నిర్మాణ పద్ధతిని మార్చి ప్రజాధనాన్ని గోదావరిలో కలిపారు
మీడియా చిట్‌చాట్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ముద్ర, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, లోపభూయిష్టమైన డిజైన్లు, నిర్మాణంలో సాంకేతిక ప్రమాణాలను పాటించకపోవడమే ప్రధాన కారణమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. డీపీఆర్‌లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని ప్రతిపాదించి, క్షేత్రస్థాయిలో సీకెంట్ పైల్ విధానాన్ని ఎందుకు అనుసరించారో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. భారీ ప్రాజెక్టులో నిర్మాణ పద్ధతిని మార్చడం వెనుక ఉన్న సాంకేతిక కారణాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అప్పటి పాలకులపై ఉందన్నారు.ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి డిజైన్, నిర్మాణ నాణ్యత, నిర్వహణలోని లోపాలు కారణమయ్యాయని తెలిపారు. పునాది కింద ఇసుక కొట్టుకుపోవడం, తగినంత బేరింగ్ సామర్థ్యం లేకపోవడం వంటి అంశాలు సమస్యకు దారితీశాయన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే తరహా నిర్మాణ విధానాలు అనుసరించినందున మిగతా బ్యారేజీల భద్రతపైనా ఆందోళనలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీఎస్ఏ సూచనలు, నిపుణుల కమిటీ నివేదికల ఆధారంగానే మరమ్మతులు చేపడుతున్నామని స్పష్టం చేశారు.

మరోవైపు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఆటను పక్కాగా ఆడుతున్నామని, వచ్చే ఎన్నికల్లో మరోసారి గోల్ కొడతామని వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు బలమైన పునాదులు, అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తల బృందం ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఎలాంటి రాజకీయ వ్యూహాలు పన్నినా ఎదుర్కొంటామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ప్రస్తుతం ఉన్న ఎనిమిది అసెంబ్లీ స్థానాలను నిలబెట్టుకోవడమే సవాల్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్రం నుంచి సహకారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా సమయాన్ని ఎక్కడా తగ్గించలేదని స్పష్టం చేశారు. హరీశ్‌రావు మామ హనుమంతరావు తప్పు చేయనప్పుడు సర్వే నిర్వహణపై ఎందుకు స్టే తెచ్చుకున్నారని ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లాలోని ఎర్రవెల్లి, శివారు వెంకటాపూర్ గ్రామాల్లో సర్వే తుది దశకు చేరుకుందని మంత్రి వెల్లడించారు.

కార్యాలయ పనుల్లో ఏఐ కీలకం

ఉద్యోగుల పనితీరు, పరిపాలనా సామర్థ్యం పెంపునకు దోహదం: వీసీ ప్రా. ఘంటా చక్రపాణి



ముద్ర, హైదరాబాద్: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా రోజువారీ కార్యాలయ పనుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం కీలకంగా మారిందని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి అన్నారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ పనులు పూర్తి చేయడంతో పాటు ఉద్యోగుల పనితీరు, పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ లెర్నింగ్ సంయుక్తంగా ఉద్యోగులకు నిర్వహించిన ఆరు రోజుల 'కార్యాలయ పరిపాలనలో కృత్రిమ మేధస్సు' శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు తమ విధులకు అనుగుణంగా ఏఐ టూల్స్‌ను వినియోగించుకోవాలని, అయితే పూర్తిగా వాటిపైనే ఆధారపడకుండా వాటి వల్ల కలిగే సమస్యలు, ప్రమాదాలను గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

రిజిస్ట్రార్ డా. ఎల్. విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని అన్నారు. శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని విధుల్లో అమలు చేయడం ద్వారా పనుల నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొ. కె. శ్రీదేవి మాట్లాడుతూ రెండు బ్యాచ్‌లుగా ఉద్యోగులకు శిక్షణ అందించామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రముఖ పాత్రికేయులు, ఏఐ నిపుణులు కూర్మనాథ్ ప్రధాన మెంటర్‌గా వ్యవహరించి కార్యాలయ నోట్ ఫైళ్ల తయారీ, పరిపాలనా విధానాలు, సర్వీస్ రూల్స్, అధికారిక పనుల్లో ఏఐ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు. విశ్వవిద్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

ఆదివారం,
22 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

ఇంటి భోజనం తిన్నా టైప్ 2
డయాబెటిస్ వస్తుందా?
మధుమేహానికి ఈ అలవాట్లే కారణం

ఇంట్లో వండిన ఆహారమే తింటున్నాం కదా.. మనకు టైప్ 2 డయాబెటిస్ రాదులే అని అనుకుంటున్నారా? అయితే జాగ్రత్త. ఈ రోజు వారీ అలవాట్లే మధుమేహానికి కారణమవుతాయట.

చాలామంది ఇంట్లో వండిన ఫుడ్ మాత్రమే తింటున్నాం కదా.. మనకు మధుమేహం రాదులే అని అనుకుంటారు. కానీ అది పూర్తిగా నిజం కాదని వైద్యులు చెప్తున్నారు. ఇంటి భోజనంలోనూ అన్నం, చపాతీలు, బంగాళదుంపలు ఎక్కువగా తీసుకుంటూ.. కూరగాయలు, పప్పులు, ప్రోటీన్లు తక్కువగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం పడవచ్చని చెప్తున్నారు. ఆహారంతో పాటు మన జీవనశైలి, శారీరక శ్రమ, నిద్ర, కుటుంబ చరిత్ర కూడా టైప్ 2 డయాబెటిస్ ముప్పును ప్రభావితం చేస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి ఆరోగ్యం విషయంలో చేసే తప్పులు ఏంటంటే.

అన్నం, చపాతీలు ఎక్కువగా తినడం

రోజువారీ భోజనంలో అన్నం, చపాతీలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. శరీరం వీటిని జీర్ణం చేసి గ్లూకోజ్‌గా మారుస్తుంది. ఒకేసారి కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకుంటే.. భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవచ్చు. అందుకే అన్నం, చపాతీలను కూడా తక్కువ పరిమాణంలో తినాలి.

పీచుపదార్థాలు లేకుంటే..

కొందరి భోజనంలో అన్నం లేదా చపాతీలే ఎక్కువగా ఉంటాయి. కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు తక్కువగా ఉంటాయి. పీచుపదార్థాలు అధికంగా ఉండే ఆహారం జీర్ణక్రియకు, రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. అందుకే ప్రతిరోజూ భోజనంలో కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలకు చోటివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రోటీన్ తీసుకోవడంలో నిర్లక్ష్యం

భోజనంలో ప్రోటీన్ సరిపడా లేకపోతే పోషక సమతుల్యత దెబ్బతింటుంది. పప్పులు, శనగలు, పెసలు, గుడ్లు, పెరుగు, చేపలు వంటి ప్రోటీన్ వనరులు భోజనంలో ఉండేలా చూసుకోవాలి. కార్బోహైడ్రేట్లతో పాటు ప్రోటీన్, పీచుపదార్థాలు ఉండేలా బ్యాలెన్స్ మీల్ ప్లాన్ చేసుకోవాలి.

ఇన్సులిన్ రెసిస్టెన్స్ ప్రాబ్లమ్

టైప్ 2 డయాబెటిస్‌కు ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఒక ముఖ్యమైన కారణం. శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించకపోతే రక్తంలో చక్కెర పేరుకుపోవచ్చు. కాలక్రమంలో ఇన్సులిన్ ఉత్పత్తి కూడా సరిపోకపోవడంతో మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతుంది.



పొట్ట చుట్టూ ఉండే కొవ్వు

శరీర బరువు ఎక్కువగా ఉండటం, ముఖ్యంగా పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం టైప్ 2 డయాబెటిస్ ముప్పును పెంచుతుంది. పొట్ట చుట్టూ ఉండే అధిక కొవ్వు ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తో సంబంధం కలిగి ఉంటుంది. అందుకే ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోవడం, నడుము చుట్టుకొలతను నియంత్రణలో ఉంచుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

రోజంతా కూర్చుని పనిచేయడం

ఆఫీసులో గంటల తరబడి కూర్చుని పనిచేయడం, ఇంటికి వచ్చాక కూడా శారీరక శ్రమ లేకుండా ఉండటం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. వ్యాయామం లేకపోవడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను సమర్థంగా ఉపయోగించుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. రోజూ కనీసం 30 నిమిషాలు నడవడం, లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, మధ్య మధ్యలో లేవడం వంటివి చేయాలి.

నిద్రలేమి, ఫ్యామిలీ హిస్టరీ

ప్రతిరోజూ తగినంత నిద్ర లేకపోవడం, దీర్ఘకాలిక ఒత్తిడి వంటి అంశాలు జీవక్రియపై ప్రభావం చూపవచ్చు. అలాగే తల్లిదండ్రులు లేదా తోబుట్టువులకు టైప్ 2 డయాబెటిస్ ఉంటే మనకూ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చు. వయసు పెరగడం కూడా ఒక రిస్క్ ఫ్యాక్టర్. కాబట్టి కుటుంబంలో మధుమేహం ఉన్నవారు ఆరోగ్య పరీక్షల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

రాకుండా ఉండాలంటే

మధుమేహం రాకుండా ఉండాలంటే.. అన్నం, చపాతీలు కంట్రోల్ చేస్తూ.. కూరగాయలు, పప్పులు, ప్రోటీన్ ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వారానికి కనీసం 150 నిమిషాలు అయినా వ్యాయామ చేయాలి. వేగంగా నడవడం కూడా మంచిదే. అధిక బరువు ఉంటే క్రమంగా తగ్గించుకోవాలి. రోజుకు 7 నుంచి 9 గంటల నిద్ర ఉండేలా చూసుకోండి. ఫ్యామిలీ హిస్టరీ, అధిక బరువు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు వైద్యుల సూచన మేరకు ఫాస్టింగ్ బ్లడ్ గ్లూకోజ్, HbA1c పరీక్షలు చేయించుకోవాలి.

స్పైసీ ఫుడ్ తినడం వల్ల
అల్సర్ వస్తుందా?

అతిగా తింటే అల్సర్లు వస్తాయి.. ఇది మనకు చిన్నప్పటి నుంచి సలహా. మీరు గూగుల్‌పై నొక్కినప్పుడు, అది 'అవును' అని వస్తుంది. సాధారణంగా, మన కడుపు, ప్రేగుల్లో మ్యూకోసా అనే సన్నని పొర ఉంటుంది. ఈ సన్నని పొరలో పగుళ్లను అల్సర్ అంటారు.

అల్సర్, అల్సర్ల మధ్య తేడా?

ఒక వ్యక్తి ఎక్కువ కారంగా ఉండే ఆహారాన్ని తిన్నప్పుడు, కడుపు ఎక్కువ ఆమ్లాన్ని స్రవిస్తుంది. ఈ ఆమ్లం కడుపు లేదా ప్రేగులను చికాకుపెడుతుంది మరియు పూతలకి కారణమవుతుంది. అయితే కేవలం స్పైసీ ఫుడ్ తినడం వల్ల అల్సర్లు వస్తాయా, అలా కాదు.

ఇవి కారణాలే కూడా!

ధూమపానం మరియు పొగాకు అలవాట్లు,
మద్యం సేవించడం
కొన్ని ఆహారాలలో హెలికోబాక్టర్ పైలోరీ (H. పైలోరీ) ఉంటుంది.
టెన్షన్
రేడియేషన్.

ఇవి కూడా కారణాలు.

-నిద్రలేమి
-కడుపు నొప్పి,
-వాంతులు అవుతున్నాయి
-ఛాతి నొప్పి
-బరువు తగ్గడం,
-యాసిడ్ కోలిక్
-అధిక బర్పింగ్

మీరు చూడకపోతే..

అల్సర్‌లకు చికిత్స చేయకుండా వదిలేస్తే, రక్త స్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మీకు రక్త వాంతులు వచ్చే అవకాశం కూడా ఉండవచ్చు. పేగులో రంధ్రం ఉండవచ్చు. క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ. మీకు తీవ్రమైన కడుపు నొప్పి ఉంటే లేదా కొన్ని రోజులు సరిగ్గా తినలేకపోతే, మీరు వైద్యుడిని సంప్రదించాలి. అల్సర్లను సాధారణంగా ఎండోస్కోపీ ద్వారా నిర్ధారిస్తారు.

ఆపగలరా?

ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు సరైన జీవనశైలిని అనుసరించాలి. స్పైసీ ఫుడ్, ఆయిల్ ఫుడ్, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. మనసుకి శరీరానికి ఒత్తిడి ఉండకూడదు.



గర్భధారణలో ఉన్నప్పుడు మహిళల బీపీ ఎంత ఉండాలి

గర్భధారణ అనేది ప్రతి మహిళ జీవితంలోనూ ఎంతో ప్రత్యేకమైన, మధురమైన కాలం. ఈ సమయంలో తల్లి ఆరోగ్యం ఎంత బాగుంటే, కడుపులో ఎదుగుతున్న బిడ్డ కూడా అంత ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే గర్భవతిగా ఉన్నప్పుడు శరీరంలో జరిగే ప్రతి చిన్న మార్పునూ గమనిస్తూ ఉండటం చాలా అవసరం. ముఖ్యంగా రక్తపోటు అంటే బిపిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవడం ఎంతో ముఖ్యం. బిపి పెరిగినా లేదా బాగా తగ్గిపోయినా తల్లికి, బిడ్డకు కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే అసలు గర్భధారణ సమయంలో బిపి ఎంత ఉండాలి, బిపి ఏ స్థాయిలో ఉంటే సురక్షితం? గర్భం దాల్చాలనే ప్రతి మహిళ, గర్భంతో ఉన్న ప్రతి మహిళ తెలుసుకోవాలి. ఆ విషయాలేంటో తెలుసుకుంటే..

బిపీ స్థాయి..

సాధారణంగా మనిషికి సరైన బిపి స్థాయి 120/80 గా ఉంటుంది. గర్భిణీలలో కూడా ఈ కొలత లేదా దీనికంటే కాస్త తక్కువగా ఉండటం సురక్షితమైనదిగా భావిస్తారు. సింపుల్ గా చెప్పాలంటే పైన ఉండే సంఖ్య 120, కింద ఉండే సంఖ్య 80 ఉంటే బిపి నార్మల్ గా ఉన్నట్లు లెక్క. పైన ఉండే సంఖ్య 110 నుంచి 120 మధ్య, కింద ఉండే సంఖ్య 70 నుంచి 80 మధ్య ఉంటే తల్లికి ఎలాంటి ప్రమాదం ఉండదు. బిడ్డకు రక్త ప్రసరణ , ఆక్సిజన్ సరఫరా చాలా చక్కగా జరుగుతాయి.

అధిక బిపి..

ఒకవేళ రక్తపోటు 140/90 లేదా అంతకంటే ఎక్కువ నమోదు అయితే దానిని అధిక రక్తపోటుగా పరిగణిస్తారు. గర్భం దాల్చిన 20 వారాల తర్వాత బిపి ఎక్కువగా ఉంటే డాక్టర్ల సలహా ప్రకారం జాగ్రత్తలు తీసుకోవడం



తప్పనిసరి. అధిక బిపి వల్ల కడుపులో బిడ్డ ఎదుగుదల మందగించడం, కాళ్ళు చేతులు వాపులు రావడం , ఉమ్మనీరు తగ్గడం వంటి ఇబ్బందులు రావచ్చు. అలాగే కొందరిలో బిపి 90/60 కంటే తక్కువగా పడిపోవచ్చు. దీనివల్ల కళ్ళు తిరగడం, నీరసం , మూర్ఛ వచ్చినట్లు అనిపిస్తుంది. కాబట్టి క్రమం తప్పకుండా బిపి చెక్ చేయించుకోవడం చాలా అవసరం.

బిపి కంట్రోల్ కోసం ఏం చేయాలి?

గర్భధారణ సమయంలో బిపిని అదుపులో ఉంచుకోవడానికి ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలి. ఆహారంలో ఉప్పు పరిమాణాన్ని పరిమితంగా ఉంచడం చాలా మంచిది. మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటూ, తగినంత విశ్రాంతి తీసుకోవడం వల్ల బిపి హెచ్చుతగ్గులకు లోనుకాకుండా ఉంటుంది. వైద్యులు సూచించిన విధంగా రోజువారీ నడక లేదా చిన్నపాటి వ్యాయామాలు చేయడం, శరీరానికి సరిపడా నీరు తాగడం వల్ల రక్తపోటును సేఫ్ స్థాయిలో ఉంచుకోవచ్చు. ఏ చిన్న తేడా అనిపించినా సొంత వైద్యం చేసుకోకుండా వెంటనే డాక్టర్ ని సంప్రదించడం మంచిది.



జిమ్‌లో లెగ్ డే..
కాళ్లు విపరీతంగా నొప్పిగా ఉన్నాయా?

జిమ్‌లో లెగ్ డే చేసిన మరుసటి రోజు మెట్లు ఎక్కడం, కుర్చీలో కూర్చోవడం, నడవడం కూడా కష్టంగా అనిపిస్తుందా? ముఖ్యంగా కొత్తగా జిమ్ మొదలుపెట్టినవారికి ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. స్క్వాట్స్, లంజెస్, లెగ్ ప్రెస్ వంటి వ్యాయామాల తర్వాత కండరాల్లో వచ్చే ఈ నొప్పిని సాధారణంగా డిలేడ్ ఆన్‌సెట్ మజిల్ సోరెనెస్ లేదా DOMS అంటారు. చాలా మంది నొప్పి వచ్చిందంటే వర్కవుట్ బాగా చేసినట్లే అనుకుంటారు. మరి ఇది ఎంతవరకు నిజం? లెగ్ డే తర్వాత వచ్చే పెయిన్‌ను ఎలా కంట్రోల్ చేయాలి? మరుసటి రోజు జిమ్‌కు వెళ్లొచ్చా? తీవ్రమైన నొప్పితే అదే కండరాలకు మళ్లీ హెవీ వర్కవుట్ చేయాలా? నిపుణులు, పరిశోధనలు ఏం చెబుతున్నాయో తెలుసుకుందాం.

లెగ్ డే తర్వాత నొప్పికి కారణం..

శరీరానికి అలవాటు లేని స్థాయిలో వర్కవుట్ చేసినప్పుడు కండరాలపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా కండరం పొడవు తూ బరువును నియంత్రించే ఎక్సెంట్రిక్ మూవ్‌మెంట్స్ DOMSకు కారణమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నొప్పి సాధారణంగా వ్యాయామం చేస్తున్న సమయంలో కాకుండా తర్వాత కనిపిస్తుంది. నొప్పిని తగ్గించేందుకు హెల్ప్ చేసే టిప్స్ ఏంటో చూసేద్దాం.

యాక్టివ్‌గా ఉండండి..

కాళ్లు నొప్పిగా ఉన్నప్పుడు పూర్తిగా రెస్ట్ తీసుకోవాల్సిన అవసరం లేదు. నెమ్మదిగా నడవడం, తేలికపాటి సైక్లింగ్ వంటి లో-ఇంటెన్సిటీ యాక్టివిటీలు చేయవచ్చు. ఇవి కండరాల బిగుతును తగ్గించి కొంత ఉపశమనం కలిగిస్తాయి. అయితే నొప్పి తీవ్రంగా ఉంటే హెవీ వర్కవుట్ చేయకపోవడం మంచిది.

ఆ తప్పు చేయకండి..

నొప్పి స్వల్పంగా ఉంటే జిమ్‌కు వెళ్లవచ్చు. కానీ అదే కాళ్ల కండరాలపై మళ్లీ స్క్వాట్స్, హెవీ లెగ్ ప్రెస్ వంటి తీవ్రమైన వ్యాయామాలు చేయడం మంచిది కాదు. బదులుగా అప్పర్ బాడీ వర్కవుట్ లేదా తేలికపాటి యాక్టివ్ రికవరీ చేయవచ్చు. తీవ్రమైన నొప్పి ఉన్నప్పుడు కొన్ని రోజులు ఆ కండరాలకు విశ్రాంతి ఇవ్వాలని ACSM సూచిస్తోంది.

వర్కవుట్ తర్వాత కూల్‌డౌన్

వర్కవుట్ పూర్తయిన వెంటనే ఆగిపోకుండా 5 నుంచి 10 నిమిషాలు నెమ్మదిగా నడవడం లేదా స్టేషనరీ బైక్‌ను తక్కువ వేగంతో తొక్కడం చేయవచ్చు. ఇది వ్యాయామం నుంచి శరీరం క్రమంగా సాధారణ స్థితికి రావడానికి సహాయపడుతుంది.

స్ట్రెచింగ్‌తో నొప్పి తగ్గుతుందా?

లెగ్స్ బిగుతుగా ఉన్నప్పుడు సున్నితమైన స్ట్రెచింగ్ చేయడం వల్ల కొంత రిలాక్స్‌గా అనిపించవచ్చు. కానీ స్ట్రెచింగ్ చేయడం వల్ల DOMS పూర్తిగా లేదా త్వరగా తగ్గిపోతాయని చెప్పలేము. కాబట్టి స్ట్రెచ్ చేసేటప్పుడు తీవ్రమైన నొప్పి వచ్చేంత వరకు లాగకండి.

ఫోమ్ రోలింగ్ లేదా మసాజ్

కండరాలు బిగుతుగా ఉన్నప్పుడు ఫోమ్ రోలింగ్ లేదా సున్నితమైన మసాజ్ కొందరికి తాత్కాలికంగా ఉపశమనం కలిగించవచ్చు. నొప్పి, బిగుతును తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి.

నిద్ర, ఆహారం

వర్కవుట్ తర్వాత రికవరీలో విశ్రాంతి, తగిన పోషకాహారం ముఖ్యమైనవి. రోజంతా తగినంత నీరు తాగడం, సమతుల ఆహారంలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లను చేర్చుకోవడం మంచిది. అయితే ఏ ఒక్క డ్రింక్ లేదా సప్లిమెంట్ తాగితే కండరాల నొప్పి వెంటనే మాయమవుతుందని అనుకోవద్దు. రికవరీకి సమయం పడుతుంది.


జిమ్‌కి వెళ్లాలా? వద్దా?

స్వల్పమైన నొప్పి ఉంటే జిమ్‌కు వెళ్లవచ్చు. కానీ తక్కువ తీవ్రతతో వ్యాయామం చేయడం లేదా ఇతర కండరాలపై దృష్టి పెట్టడం మంచిది. తీవ్రమైన నొప్పి ఉంటే నడవడం, కూర్చోవడం వంటి రోజువారీ పనులే కష్టంగా ఉంటే.. హెవీ వర్కవుట్‌ను ఆపి విశ్రాంతి తీసుకోవడం మంచిది. DOMS ఉన్నప్పుడు తీవ్రమైన వ్యాయామం కొనసాగిస్తే సమస్య మరింత పెరగవచ్చు.

డాక్టర్ దగ్గరకు వెళ్లాలా?

సాధారణ DOMS కొన్ని రోజుల్లో క్రమంగా తగ్గుతుంది. కానీ నొప్పి చాలా తీవ్రంగా ఉండటం, కండరం బాగా వాపు రావడం, వారం రోజులకుపైగా నొప్పి తగ్గకపోవడం లేదా మూత్రం అసాధారణంగా ముదురు రంగులో కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇవి సాధారణ వర్కవుట్ తర్వాత వచ్చే నొప్పి కాకపోవచ్చు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం..



మారుతున్న ఆధునిక జీవనశైలి కారణంగా మనుషులు క్రమంగా ప్రకృతికి దూరమవుతున్నారు. బిజీ లైఫ్ కారణంగా ఉదయం కాని, సాయంత్రం కాని వ్యాయామం లేదా వాకింగ్ చేస్తారు. చాలా కష్టపడ్డామని ఫీల్ అవుతారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే అది ఎలా చేస్తాన్నామనేది పెద్ద ప్రశ్న. సిమెంట్ రోడ్లు లేదా తార్ రోడ్లపై షూస్ వేసుకోవడం లేదా చెప్పులు వేసుకుని నడుస్తాం. అయితే అలాంటి నడకతో సంపూర్ణ ఆరోగ్యం రాదని అధ్యయనాలు చెబుతున్నాయి. చెప్పులు, షూలు వేసుకుని తిరగడం వల్ల శారీరకంగా హెల్త్ సమస్యలు వస్తాయని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. మంచి ఆరోగ్యం పొందాలంటే ప్రకృతి ప్రసాదించిన పచ్చగడ్డపై చెప్పులు, షూలు లేకుండా నడవడం ఎంతో ఉత్తమమం అని చెబుతున్నారు. దీని ద్వారా సానుకూల ప్రభావం చూపుతుందంటున్నారు. కాసేపు ఒట్టి కాళ్లతో పచ్చగడ్డమీద నడవం వల్ల శరీరానికి, మనసుకు అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అలా పచ్చిక బయళ్ల మీద నడవడాన్నే గ్రౌండింగ్ లేదా ఎర్తింగ్ అని పిలుస్తారు.

కాళ్లకు చెప్పులు లేకుండా పచ్చగడ్డిపై నడవం వల్ల మానసిక ప్రశాంతత కావల్సినంత దొరుకుతుందంటా. ఇది ఆరోగ్య ప్రయోజనాల్లో మొదటి నియమం అని నిపుణులు చెబుతున్నారు. నేరుగా పాదాలు భూమిని తాకడం వల్ల నాడీ వ్యవస్థ శాంతించి, ఒత్తిడిని కలించే హార్మోన్ల స్థాయిలను తగ్గిస్తాయి. అలాగే పాదాలలో ఉండే నరాల ఉత్తేజపడి శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతోంది. పాదాల కండరాలు, స్నాయువులు బటపడటంతో పాటు శరీర సమతుల్యత కూడా మెరుగుపడుతోంది. కాళ్లు, పాదాల నొప్పుల నుంచి ఉపశమనం తోపాటు రోజంతా ఉత్సాహంగా గడపుతారు. ఇలా చేయడం వల్ల నిద్రలేమీ సమస్య కూడా తగ్గిపోతుంది. నేరుగా పాదాలు భూమిని తాకి నడిచినప్పుడు .. సహజ ఎలక్ట్రాన్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తటస్థపరిచి శరీరంలోని వాపులు తగ్గుతాయి. దీని వల్ల రాత్రి పూట గాఢమైన నిద్ర పడుతోంది. మెదడు రిలాక్స్ అవుతోంది. ఉదయం పూట ఎండలో నడవం వల్ల కూడా పాదాలపై పడే సూర్యరశ్మి ద్వారా శరీరంలోకి మిటమిన్ డి చేరుతుందని వైద్యులు చెబుతున్నారు. షో ఇంకేందుకు ఆలస్యం రేపటి నుంచి మీరు కూడా చెప్పులు, షూలు లేకుండా పార్కుల్లో, అపార్ట్‌మెంట్ ముందున్న గ్రౌండ్‌లో అలా అలా ఒక అరగంట పాటు నడవండి. మంచి ఆరోగ్యాన్ని పొందండి. సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోండి.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.11.2026
www.mudranews.in | @mudranews

ధూమపానానికి స్వస్తి చెప్పండి
పొగతాగడం వల్ల శ్వాస మార్గాల్లో వాపు, చికాకు ఏర్పడవచ్చు. అందుకే ధూమపానాన్ని పూర్తిగా మానేయడం మంచిది.



వార్తల కన్నా.. ఫొటోలోనే ఆకర్షణ శక్తి ఎక్కువ

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్







ముద్ర, హైదరాబాద్, నవంబర్ 21: పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తల కన్నా, ఫొటోలోనే ఎక్కువ ఆకర్షణ శక్తి ఉంటుందని, ఫోటో క్షణాల్లోనే వేల భావాలను ప్రజల హృదయాల్లోకి తీసుకెళ్లగలగుతుందని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫోటో జర్నలిస్టుల అవార్డుల ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.చదివిన వార్తను పాఠకులు మరిచిపోవచ్చు కానీ మనసును కదిలించే ఫోటో మాత్రం జీవితాంతం గుర్తుండిపోతుందని స్పీకర్ తెలిపారు. అందుకే ఫోటో అంటే కేవలం దృశ్యం మాత్రమే కాదని, అది ఒక చరిత్ర అని ఆయన స్పష్టం చేసారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి ప్రజాస్వామ్య ఉద్యమాల వరకు, ప్రకృతి వైపరీత్యాల నుంచి యుద్ధాల వరకు, పెదరికం నుంచి సామాజిక వివక్ష వరకు.. ప్రపంచ చరిత్రలో ఎన్నో కీలక ఘట్టాలను మన కళ్ల ముందు నిలిపింది ఫోటో జర్నలిజమేనని ప్రసాద్ కుమార్ కొనియాడారు. ఒక పేద తల్లి కన్నీటిని, ఆకలితో అలమటిస్తున్న చిన్నారి పరిస్థితిని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల ఆవేదనను, ప్రజల కోసం పోరాడుతున్న ఉద్యమకారుల తెగువను ప్రపంచానికి పరిచయం చేసేది ఫోటో జర్నలిస్టు కెమెరానే అని ఆయన అన్నారు. ఒక ఫోటో ప్రభుత్వాన్ని ఆలోచింప జేస్తుందని, ఒక ఫోటో అధికార వ్యవస్థను ప్రశ్నిస్తుందని, ఒక ఫోటో ప్రజా ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తుందని, ఒక ఫోటో సమాజంలో మార్పుకు నాంది కావచ్చని ఆయన అన్నారు. అందుకే ఫోటో జర్నలిస్టు కెమెరా ఎప్పుడూ నిజం వైపు గురిపెట్టాలని, వారి ఆలోచన ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండాలని, వృత్తి నిబద్ధత ఎప్పుడూ జర్నలిజం విలువలను కాపాడాలని స్పీకర్ కోరారు. ఫోటో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ కెమెరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానం ఫోటో జర్నలిజంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని, క్షణాల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఫోటోను చేరవేయగలుగుతున్న ఒక గొప్ప అవకాశం ఏర్పడడం మంచి పరిణామమే అయినప్పటికీ, ఇది ఒక పెద్ద సవాలు కూడా అని ఆయన అన్నారు. మార్ఫింగ్, ఫేక్ ఫోటోలు, ఏఐ సృష్టించిన దృశ్యాలు, తప్పుడు సమాచారంతో కూడిన చిత్రాలు సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఫోటో జర్నలిస్టులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఫోటో జర్నలిస్టులు వృత్తి నైతికతను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదని ఆయన సూచించారు.తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఫోటో జర్నలిస్టు మీడియా సంస్థలో ఉద్యోగి మాత్రమే కాదని, అతను కాలానికి సాక్షి, చరిత్రలో సైనికుడని అభివర్ణించారు. సమాజంలో సంఘర్షణతో కూడుకున్న వృత్తుల్లో ఫోటో జర్నలిజం ఒకటని ఆయన అన్నారు. అసలే కత్తిమీద సాములాంటి జర్నలిజం వృత్తిలో ఫోటో జర్నలిస్టుల కష్టాలు వర్ణనాతీతమన్నారు. విధినిర్వహణలో కష్టాలు, కుటుంబ పోషణలో కష్టాలను ఫోటో జర్నలిస్టులు అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఫోటో జర్నలిస్టులకు తమ సంఘం అండగా నిలబడి, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్నట్లు విరాహత్ అలీ అన్నారు. ఇంకా ఈ సభలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, జాతీయ ఉపాధ్యక్షుడు వై. నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఫోటో జర్నలిస్టులను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సత్కరించి, అవార్డులు అందజేశారు.

బ్రాండ్ హైదరాబాద్ ను దెబ్బతీస్తున్నారు

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని మెటా కార్యాలయంపై కాంగ్రెస్ యువజన నేతలు దాడికి దిగడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బ్రాండ్ హైదరాబాద్'కు ఇలాంటి ఘటనలు నష్టం కలిగిస్తాయని, దశాబ్దాలుగా ఎన్నో అనుకూల విధానాలతో నిర్మించుకున్న నగర ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని విమర్శించారు. మెటా వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు నగరంలో సురక్షితమైన పని వాతావరణం ఉంటుందనే నమ్మకమే కారణమని పేర్కొన్నారు. కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. దేశవ్యాప్తంగా లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించే బ్రాండ్ హైదరాబాద్ ఎన్నో ఏళ్ల కృషితో నిర్మితమైందని తెలిపారు. వ్యాపార అనుకూల విధానాలతో హైదరాబాద్ అంతర్జాతీయ సంస్థలకు ఆకర్షణీయమైన కేంద్రంగా ఎదిగిందన్నారు. మెటా కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు దానిని గొప్పగా చెప్పుకోవడం మరింత బాధాకరమని విమర్శించారు. మీ మూడేళ్ల పాలనలో హైదరాబాద్‌కు ఒక్క పెద్ద అంతర్జాతీయ బ్రాండ్‌నైనా తీసుకొచ్చారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కంపెనీలను భారత్‌కు తీసుకొచ్చే మార్గం గూండాయిజమేనా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని నిలదీశారు. మెటాకు భారత్‌లోనే అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని తెలిపారు. సురక్షితమైన పని వాతావరణం కల్పిస్తామన్న హామీతోనే వారు మన నగరాన్ని ఎంచుకున్నారని పేర్కొన్నారు. నిన్నటి ఘటన కేవలం గాజు అద్దాలను పగలగొట్టలేదు.. బ్రాండ్ హైదరాబాద్‌పై ఉన్న నమ్మకాన్ని కూడా దెబ్బతీసింది అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా, కొండాపూర్ నాలెడ్జ్ సిటీలోని స్కై వ్యూ వాణిజ్య సముదాయంలో ఉన్న మెటా కార్యాలయంలోకి తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జకిడి శివచరణ్‌రెడ్డి తన అనుచరులతో కలిసి చొచ్చుకెళ్లేందుకు శుక్రవారం ప్రయత్నించారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను, ఇన్‌చార్జ్ మణిశర్మ సోషల్ మీడియా ఖాతాలను మెటా నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. మెటా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయ ప్రాంగణంలోని పూల కుండీలను ధ్వంసం చేశారు. నిలిపివేసిన సోషల్ మీడియా ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు అక్కడికి చేరుకుని 21 మంది కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విడుదల చేసినట్లు సమాచారం.

ఘనంగా అనిరుధ్ - కావ్య రిసెప్షన్..





హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు

ముద్ర, కరీంనగర్ : ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ , సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) సీఈవో, సన్ నెట్‌వర్క్ అధినేత కళానిధిమారన్ కుమార్తె కావ్య మారన్ వివాహం బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. శనివారం వీరి వివాహ రిసెప్షన్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు సీఎం విజయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్, తమిళనాడు మాజీ సీఎంలు స్టాలిన్, పళనిస్వామి, అగ్ర నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, రాధికా శరత్‌కుమార్, క్రికెటర్ భువనేశ్వర్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

హామీలు కాదు.. అమలు కావాలి

బసిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దుపై స్పష్టమైన అధికారిక ప్రకటన చేయాలి
డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమితో సహా మొత్తం ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి
డిసెంబర్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటం జాయింట్ యాక్షన్ కమిటీ



ముద్ర, రంగారెడ్డి : సిద్దాపూర్ గ్రామంలో ఎకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డు ఏర్పాటు కు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 641 ని రద్దు చేయాలని సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 49 రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గ్రామంలో ఈ ఉద్యమాన్ని పక్క దారి పట్టించేందుకు పరిశ్రమల పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారు, ప్రజలకు వాస్తవిక పరిస్థితులను చెప్పటానికి, మంత్రి ఇచ్చిన హామీ పై, ప్రస్తుతం పరిణామాలపై దీక్షా శిబిరంలో జేఏసి నాయకులు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.... రేపటితో ఈ నిరాహార దీక్షలు 50 రోజులకు చేరతాయని , ఈ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర మంత్రి డంపింగ్ యార్డు పై ఇచ్చిన హామీని స్థానిక శాసన సభ్యులు నమ్మి విశ్వసిస్తే మా మంత్రి హామీ ఇచ్చారు మీరు రండి కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్తా లేక ఇంచార్జ్ మంత్రి దగ్గరకు తీసుకెళ్తా మీకు ఒక హామీ ఇస్తా జీవో ను ఒక 10 రోజుల్లో రద్దు చేయిస్తా అనే స్వస్తమైన హామీ ఇవ్వాలి. లేని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో నీ ఇల్లు ముట్టడిస్తాం, నీవు కలసివస్తే మీ సీఎం ఇల్లు ముట్టడిస్తాం అని అన్నారు. ఇక్కడ ఈ సమస్య పరిష్కారం కాకముందే అభివృద్ధి పేరుతో కాలుష్య పరిశ్రమలు తీసుకొస్తే చూస్తూ ఊరుకోం అన్నారు. జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ... ప్రజల తరుపున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరేది ఒకటే ప్రజలకు నష్టం చేసే డంపింగ్ యార్డు ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి ఈ భూముల్లో ఇప్పుడు పొల్యూషన్ కంపెనీలు తెస్తా అంటే కుదరదు. మీకు చేయనైతే ఆ భూముల్లో కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేయండి, లేకపోతే ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమాన్ని జీవో రద్దు చేసేవరకు కొనసాగిస్తామని, ఇకనుండి ఉధృతం చేస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ... 49 రోజులుగా కొనసాగుతున్న ఉద్యమానికి సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, మంత్రి గాని స్థానికి శాసన సభ్యులు ఇచ్చిన మాట ప్రకారం ఎప్పటిలోగా డంపింగ్ యార్డు ను రద్దు చేస్తారో స్పష్టంగా చెప్పాలి. పరిశ్రమలను , అభివృద్ధిని స్వాగతిస్తాం కానీ అభివృద్ధి పేరుతో కాలుష్యం పరిశ్రమలు తీసుకొస్తే సరైనది కాదు. స్థానిక శాసన సభ్యులు వెంటనే జేఏసీ నాయకులతో చర్చించి జీవో 641 రద్దు పై స్పష్టమైన ప్రకటన చేయాలని, లేని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని హెచ్చరించారు..జేఏసీ కన్వీనర్ పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ.... రాష్ట్ర మంత్రి నందిగామలో డంపింగ్ యార్డు రాదు రానివ్వను అన్నారు, దానికి జేఏసీ తరుపున స్వాగతించడం జరిగింది. కానీ జేఏసీ గా ఎప్పటిలోగా రద్దు చేస్తారని అడిగాము. స్థానిక శాసన సభ్యులు అభివృద్ధి కార్యక్రమాల పేరుతో సిద్దాపూర్ వచ్చి కనీసం దీక్షా శిబిరాన్ని సందర్శించక పోగా అవమాన పరచే విధంగా మాట్లాడటం సరైనది కాదు. మీరు అవమాన పరిచింది ప్రజలను అనే విషయం మర్చిపోగూడదన్నారు. నిజంగా గత ప్రభుత్వంలో 120 జీవో తెచ్చారని , అందుకే డంపింగ్ యార్డు వచ్చిందనే మీరు ఆ జీవో ను రద్దు చేయొచ్చు,గత నాయకులు తప్పులు చేసి, అన్యాయంగా భూములు గుంజుకుని, అక్రమంగా ఆస్తులు సంపాదిస్తే మీరు అధికారంలోనే ఉన్నారు, దానిపై విచారణ జరిపి వారిని జైలుకు పంపండి, కానీ ఏదో మాట్లాడుతూ సమస్యను పక్కదారి పట్టిస్తూ , ప్రజల మధ్య అనవసర గందరగోళం సృష్టించే ప్రయత్నం సరైంది కాదు అన్నారు. ఇప్పుడు పరిశ్రమలు వస్తే డంపింగ్ యార్డు రాదు అనే కొత్త చర్చకు తెరలేపి కాలుష్య కారక పరిశ్రమల స్థాపనలు ఆపివేయాలి, ఆ భూములను పేదలకు పంచాలి. డంపింగ్ యార్డు రద్దు కొరకు మంత్రి ఇచ్చిన హామీ నెరవేరకపోతే డిసెంబర్ 7 తరువాత ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అప్పుడు జరిగే పరిణామాలకు స్థానిక శాసన సభ్యులే బాధ్యత వహించాలని అన్నారు.. జేఏసీ కో ఆర్డినేటర్ తిరుమలయ్య మాట్లాడుతూ... ఉద్యమం ప్రజాస్వామ్య బద్దంగా ఒక క్రమ పద్ధతిలో జరుగుతుందని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం , హామీ ఇచ్చిన మంత్రి అధికారిక ప్రకటన చేయించక పోవడం ఏంటని ప్రశ్నించారు. ఉద్యమాన్ని పక్కదారి పట్టించడం కోసం ప్రజలను అవమాన పరచే విధంగా శాసన సభ్యులు మాట్లాడిన దానిని ఖండిస్తున్నాం అన్నారు. డంపింగ్ యార్డు రద్దు కాక ముందే గ్రామంలో కాలుష్య కారక పరిశ్రమల స్థాపనలు చేయాలను ప్రయత్నించటం మానుకోవాలని, భూమి ఉండబట్టే కదా ఇలాంటి నిర్ణయాలు కాబట్టి వెంటనే ఆ భూమిని పేదలకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వడ్డే బాలయ్య, అర్జునప్ప, రవీంద్రనాథ్, బుద్దల జంగయ్య, గూని మహేష్, రాజేందర్ రెడ్డి, శ్రీధరాచారి, నాగేష్ నాయక్, బాబురాజ్, బైర్ఖంపల్లి సర్పంచ్ శివ, మాజీ సర్పంచులు రమేష్ నాయక్, యాదగిరి, మరియు నక్కల వెంకటేష్ గౌడ్, వడ్డే మల్లేష్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై అటవీ శాఖ చర్యలు

రెండు ఇమ్మర్షన్ మోటార్లు స్వాధీనం



ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లా అటవీ అధికారి జోజి ఆదేశాల మేరకు మెదక్ రేంజ్ పరిధిలోని పాతూర్ సెక్షన్, ఆవుసులపల్లి బీట్ రిజర్వ్ ఫారెస్ట్‌కు ఆనుకొని ఉన్న వాగుల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, వడపోతకు ఉపయోగిస్తున్న రెండు ఇమ్మర్షన్ మోటార్లను అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే పరిస్థితుల దృష్ట్యా, భవిష్యత్తు అవసరాల కోసం సహజ నీటి వనరులను సంరక్షించడం అత్యంత ముఖ్యం. అందువల్ల వాగుల్లో అక్రమ ఇసుక తవ్వకాలు, వడపోత పూర్తిగా నిషేధించబడ్డాయి.ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి జోజి హెచ్చరించారు. ప్రజలు నీటి వనరుల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

సొంత ఖర్చులతో పాఠశాలలో వాటర్ ప్లాంట్



ముద్ర ప్రతినిధి, మెదక్ : హవేలిఘనపూర్ మండలం కూచన్‌పల్లి పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో మధుమోహన్ తన సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. తన తండ్రి జ్ఞాపకార్థం రూ.45 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. విద్యార్థుల దాహం తీర్చేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మధుమోహన్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.11.2026
www.mudranews.in | @mudranews

మద్యం, నిద్రమాత్రలకు దూరంగా ఉండండి

రాత్రివేళ మద్యం తీసుకోవడం, వైద్యుల సూచన లేకుండా నిద్రమాత్రలు వాడటం వల్ల స్లీప్ అప్నియా తీవ్రత పెరగవచ్చు.



పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపునకు ప్రతిపాదనలు

ముద్ర, హైదరాబాద్: పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపునకు ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనలు పంపించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు కరం సింగ్ కర్మ మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లకు సూచించారు. సోమవారం జీహెచ్ఎంసీ, సీహెచ్ఎంసీ, ఎంఎంసీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కార్మికుల సమస్యలు, సంక్షేమ సదుపాయాలపై సమీక్షించారు. కార్మికులకు ఆరోగ్య బీమా, పీఎఫ్, కనీస వేతనాలు, పీపీఈ కిట్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు సకాలంలో అందించాలని ఆదేశించారు.

కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దు

ముద్ర, హైదరాబాద్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ని ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారనే వార్తల నేపథ్యంలో ముఖ్యమంత్రి స్పందించారు. కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ఆదేశించారు. కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఖరారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.


ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలి



ముద్ర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని గుర్తింపు కమిటీ నిర్ణయించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల వివరాల నమోదు, గుర్తింపు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటుపై ప్రధానంగా చర్చించారు. వెబ్‌సైట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, తదుపరి సమావేశంలో పురోగతిని సమీక్షించి ప్రారంభ తేదీని ప్రకటించాలని నిర్ణయించారు.

కరీంనగర్ మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

చిగురుమామిడి బీజేపీ సన్నాహక సమావేశంలో కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఖమ్మం వెంకటేశం పిలుపు



ముద్ర, చిగురుమామిడి: కరీంనగర్‌లో ఈ నెల 23న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిగురుమామిడి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ.. చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి పాదయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగబద్ధ సంస్థలు, ఎన్నికల సంఘంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలకు వివరించడమే ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మహా పాదయాత్రను విజయవంతం చేయాలని సమావేశంలో నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల బాధ్యులు, బూత్ అధ్యక్షులు, 17 గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల శిబిరంలో అంగన్ వాడీ కార్యకర్తల సేవలు బేస్

ఓ వికలాంగున్ని వీల్ చైర్ పై తీసుకొస్తున్న బొమ్మనపల్లి సర్పంచ్



ముద్ర, చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, అలింకో సంస్థ సహకారంతో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కోసం వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన అర్హులకు పరీక్షలు నిర్వహించి, అవసరాన్ని బట్టి కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, చేతికర్రలు, మూడు చక్రాల వాహనాలు అందజేయనున్నారు. ఈ శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అందించిన సేవలు ప్రత్యేకంగా నిలిచాయి. బొమ్మనపల్లి సర్పంచ్ ఓ దివ్యాంగుడిని స్వయంగా వీల్‌చైర్‌పై శిబిరానికి తీసుకురావడం సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి ,సహకార సంఘం చైర్మన్ చిటమల్ల రవీందర్, జిల్లా కార్యదర్శి సాంబారి బాబు, సర్పంచులు జంగ శిరీష రమణ రెడ్డి, మౌనిక, భవాని శివప్రసాద్, లక్ష్మి మురాహర్ రెడ్డి, అల్లెపు సంపత్, కాటం సంపత్ రెడ్డి, మండల అధ్యక్షుడు అందే సురేష్, సామాజికవేత్త తిప్పారపు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు గాజపాక సునీల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు, పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు..

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్



ముద్ర, జగిత్యాల : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి చేయూత పింఛన్లు అందజేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ సంఘం అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రోసిడింగ్ లతో పాటు కల్యాణ లక్ష్మి చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు 200 యూనిట్లకు పేదల తరుపున ప్రభుత్వం కరెంట్ బిల్లు చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్టీసీలు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నా మని మంత్రి తెలిపారు.

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నాలుగు గ్యారంటీలు అమలు చేశామని మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చేయూత పింఛను అందించి అండగా నిలవాలని ఉద్దేశంతో కొత్త పింఛన్లు మంజూరు చేశారని అన్నారు. బుగ్గారం మండలానికి కొత్తగా 338 చేయూత పింఛన్లు మంజూరు అయినట్లు మంత్రి తెలిపారు. మండలంలో అర్హత ఉన్న వారిని గుర్తించి పింఛన్లు విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. బుగ్గారం మండలానికి 422 ఇందిర ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. మండలంలో అర్హత ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ను అందజేస్తామని మంత్రి తెలిపారు. బుగ్గారం మండల అభివృద్ధి కి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బుగ్గారం మండల కేంద్రంలో నిర్మించిన పోచమ్మ ఫంక్షన్ హాల్ ని మంత్రి ఈ సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ బలోపేతానికి సభ్యత్వ నమోదు చేపట్టాలి

- చాడ వెంకటరెడ్డి



ముద్ర, కరీంనగర్: గ్రామస్థాయి నుంచి సిపిఐని బలోపేతం చేసేందుకు 2027 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో బోయిని అశోక్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడు తూ, పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల మధ్య ఉం టూ వారి సమస్యలపై పోరాటాలు నిర్వహిం చాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలం గా వ్యవహరిస్తూ నిరుద్యోగం, పేదరికాన్ని పెంచుతోందని విమర్శించారు. తెలంగాణ కు రావాల్సిన నిధులు, విభజన హామీల అమలుపై కేంద్రాన్ని నిలదీయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అందించాలని కోరారు. సమావేశ వివరాల ను జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ వెల్లడించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజా ల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పొన గంటి కేదారి, అందె స్వామి,కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్,నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, రాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధ్యానం కొనుగోలు..

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్..



ముద్ర, బుగ్గారం: రైతులకు మద్దతు ధర చెల్లించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినది మంత్రి తెలిపారు. రైతులకు కావాల్సిన గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు అనంతరం మిల్లర్ల నుండి వచ్చే సమస్యలను ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్ చార్జీ పరిష్కరించాలని మంత్రి సూచించారు. రైతులను ఎక్కడ ఇబ్బంది పెట్టవద్దని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రారంభించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

బుగ్గారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త హైమద్ ఇటీవల ఆనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ శనివారం పరామర్శించి ప్రాగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- హరీశ్ రావు



ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరుగుతున్న పార్టీ చేరికలే బీఆర్ఎస్ పునరాగమనానికి సంకేతమని పేర్కొన్నారు. ఖైరతాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శ్రీనాథ్‌తో పాటు పలువురికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని, నగరంలో తాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలు, దోమల బెడద పెరిగాయని ఆరోపించారు. బస్తీ దవాఖానాల్లో మందుల కొరత, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాల నిలిపివేత, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పెన్షన్ల పెంపు హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు.

అల్ఫోర్స్‌లో వింటర్ గాలా సందడి.. జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక







ఆటపాటలతో చిన్నారుల సంబరాలు.. ఆరుష్ వర్ధన్‌కు బంగారు పతకం

ముద్ర, కరీంనగర్: విద్యతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి అల్ఫోర్స్ విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని ఆ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో నిర్వహించిన 'వింటర్ గాలా – ఎ డే ఆఫ్ ఫన్, ఫ్రోలిక్ అండ్ ఫెస్టివిటీస్' వేడుకలు చిన్నారుల ఆటపాటలు, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. అదే సమయం లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి ఆరుష్ వర్ధన్ 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) జాతీయస్థాయి అండర్-14 బాలుర బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో శీతాకాలపు వాతావరణాన్ని ప్రతిబింబించేలా అందంగా అలంకరించిన వేదికపై చిన్నారుల కోసం వివిధ వినోదాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్నోమ్యాన్ తయారీ, స్నోబాల్ టాస్, రింగ్ టాస్, స్నోఫ్లేక్ ఆర్ట్, శీతాకాలపు ప్రత్యేక ఆటలు, హస్తకళలు, నృత్య ప్రదర్శనల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు శారీరక చలన నైపుణ్యాలు, సామాజిక సంబంధాలు, కలిసిమెలిసి పనిచేసే తత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆటల ద్వారా ఆనందంగా నేర్చుకునే అనుభూతిని కల్పించడమే ఇలాంటి వేడుకల ముఖ్య ఉద్దేశమన్నారు.

మరోవైపు, హైదరాబాద్‌లో నిర్వహించిన 70వ SGF రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి ఆరుష్ వర్ధన్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ విజయంతో నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభను కనబరిచి పతకాలు సాధించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర కీర్తిని చాటాలని ఆకాంక్షించారు.

క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని ఆయన తెలిపారు. ఒత్తిడిని తగ్గించి, జట్టు స్ఫూర్తి, పరస్పర సహకారం, లక్ష్య సాధనకు అవసరమైన పట్టుదలను క్రీడలు అలవర్చుతాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వివిధ క్రీడలకు నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ అందిస్తూ, విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. వింటర్ గాలా కార్యక్రమంలో చిన్నారుల చిరునవ్వులు, ఆనందకేరింతలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, క్రీడల్లో ప్రతిభ చాటిన ఆరుష్ వర్ధన్ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులు, క్రీడాకారులను నరేందర్ రెడ్డి అభినందించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.11.2026
www.mudranews.in | @mudranews

తల కొద్దిగా ఎత్తులో ఉంచండి:

నిద్రపోయేటప్పుడు తలకు కొద్దిగా ఎత్తు ఉండేలా చూసుకోవడం కొందరిలో గురక తగ్గించేందుకు సహాయపడుతుంది.



బాలల భద్రతకు ప్రత్యేక కార్యాచరణ చట్రం

యునిసెఫ్ సాంకేతిక సహకారంతో రూపకల్పన..
మూడు సంవత్సరాల అమలు ప్రణాళిక
73 ప్రాంతాల్లో 9,558 మంది పిల్లల అభిప్రాయాల సేకరణ



ముద్ర, సూర్యాపేట, నవంబర్ 20:బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సూర్యాపేట జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని యునిసెఫ్ సాంకేతిక సహకారంతో రూపొందించిన జిల్లా బాలల పరిరక్షణ కార్యాచరణ చట్రాన్ని (చైల్డ్ ప్రొటెక్షన్ ఫ్రేమ్‌వర్క్) శుక్రవారం ఆవిష్కరించింది.కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద రూపొందించిన ఈ కార్యాచరణ ద్వారా ఇప్పటికే అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలు, వివిధ శాఖల సేవలను సమన్వయం చేసి పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించనున్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, వేధింపులు, నిర్లక్ష్యం, దోపిడీ వంటి సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడంతోపాటు ఆపదలో ఉన్న పిల్లలకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో భాగంగా జిల్లాలోని 73 ప్రాంతాల్లో 9,558 మంది పిల్లల అభిప్రాయాలను సేకరించడం విశేషం. వారి అవసరాలు, సమస్యలు, భద్రతకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని కార్యాచరణ రూపొందించారు.అన్ని శాఖల సమన్వయంతో అమలుజిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సమన్వయ బాధ్యతలు నిర్వహించనున్నాయి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంస్థలు, పోలీస్ శాఖ, భరోసా కేంద్రాలు, బాలల సంక్షేమ కమిటీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, బాలల సంరక్షణ సంస్థలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయనున్నాయి.ఐసీడీఎస్, ఆరోగ్యలక్ష్మి , బాలామృతం, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, మిషన్ వాత్సల్య సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నారు. బాలికా చైతన్యం, ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్, పోలీస్ భరోసా వంటి కార్యక్రమాలను కూడా ఈ వ్యవస్థతో అనుసంధానించనున్నారు. పాఠశాలల్లో బాలల భద్రత, మానసిక, భావోద్వేగ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ స్కూల్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లను గుర్తించారు.మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికఈ ఫ్రేమ్‌వర్క్‌ను మూడేళ్లపాటు దశలవారీగా అమలు చేయనున్నారు. ప్రతి శాఖ ప్రాధాన్యతా కార్యక్రమాలను గుర్తించడం, సేవల్లో ఉన్న లోపాలను సరిదిద్దడం, బాలల పరిరక్షణకు సంబంధించిన పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం ఇందులో భాగంగా ఉంటుంది.2026 సెప్టెంబర్‌లో జిల్లా యంత్రాంగం, యునిసెఫ్ మధ్య ప్రాథమిక సంప్రదింపులతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వివిధ శాఖలు, బాలల పరిరక్షణ సంస్థలతో సమావేశాలు నిర్వహించి ప్రస్తుత వ్యవస్థ పనితీరును అధ్యయనం చేశారు. నవంబర్ 12న జిల్లా యంత్రాంగం చైల్డ్ ప్రొటెక్షన్ సిస్టమ్ స్ట్రెంతెనింగ్ విధానాన్ని అధికారికంగా స్వీకరించింది.ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, బాలల పరిరక్షణ కోసం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడం ఈ కార్యాచరణ చట్రం ఉద్దేశం కాదని, ఇప్పటికే అమలవుతున్న పథకాలు, శాఖల సేవలను సమర్థవంతంగా సమన్వయం చేయడమే లక్ష్యమని తెలిపారు. బాలల సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడమే కాకుండా, ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో సహాయం అందించడం, పునరావాసం కల్పించడం, సురక్షిత పాఠశాలలు, సహకరించే కుటుంబాలు, పిల్లల అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం అవసరమన్నారు. బాలల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వ శాఖల తోపాటు కుటుంబాలు, సమాజం కూడా భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ప్రశ్నించే తత్వమే విజ్ఞానానికి పునాది

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు రజినీ
విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే వేదిక
చెకుముకి టాలెంట్ టెస్ట్
ఎంఈఓ వెంకట్‌రామ్‌రెడ్డి
ఘనంగా కీసర మండల స్థాయి చేకుముఖి టాలెంట్ టెస్ట్



ముద్ర, నాగారం :విద్యార్థులు ప్రతి అంశాన్ని ప్రశ్నిస్తూ, సమాధానాలు తెలుసుకునే అలవాటు పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు రజినీ పిలుపునిచ్చారు. ప్రశ్నించే తత్వమే శాస్త్రీయ ఆలోచనలకు పునాది అని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక సైన్స్ సంబరాల్లో భాగంగా కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష ప్రశ్నాపత్రాన్ని కీసర మండల విద్యాశాఖ అధికారి వెంకట్ రామ్ రెడ్డి విడుదల చేశారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షురాలు రజినీ మాట్లాడుతూ.. పుస్తకాల్లోని అంశాలను కంఠస్థం చేయకుండా, వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకోవాలన్నారు. ప్రతి విషయంపై సందేహాలు వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను ప్రశ్నించి సమాధానాలు తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి పరీక్షలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కీసర మండల విద్యాశాఖ అధికారి వెంకట్‌రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సైన్స్ పోటీలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. చదువుతోపాటు నిత్యజీవితంలో ఎదురయ్యే అంశాలను పరిశీలించి, అవగాహన పెంచుకోవాలని సూచించారు. నాగారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభ, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని, ప్రతి అంశాన్ని పరిశీలించి శాస్త్రీయ కారణాలను తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ విద్యార్థులకు విజ్ఞానాన్ని చేరువ చేయడంలో చెకుముకి పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయి పరీక్షకు ప్రైవేట్ పాఠశాలల నుండి నుండి పుడిమి, లోటస్, విజ్ఞాన జ్యోతి పాఠశాలలో అర్హత సాధించాయి. ప్రభుత్వ పాఠశాల నుండి నాగారం, కీసర, చీర్యాల, రెసిడెన్షియల్ పాఠశాల నుండి బోగారం, కీసర, అంకిరెడ్డి పల్లి జిల్లాస్థాయి పరీక్షలకు అర్హత సాధించాయి.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాస్, కోశాధికారి జొన్నీ, కీసర మండల కమిటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, సీనియర్ నాయకులు ఎం.ఎల్.చౌదరి, రాజాన్ సింగ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు రామచంద్రయ్య, వందన అనిత, తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత

డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి



ముద్ర, కూకట్‌పల్లి : ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తూ, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి స్పష్టం చేశారు. రోడ్లు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, చెత్త సేకరణ తదితర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఆమె ప్రజలను కోరారు.ప్రజలు తమ ఫిర్యాదులను MyGHMC (మై జీహెచ్ఎంసీ) యాప్, X (ట్విట్టర్) లేదా సర్కిల్ కార్యాలయంలోని ఇన్‌వార్డ్ విభాగం ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. అంతేకాకుండా, ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమంలో ప్రజలు నేరుగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ నెల చివరి నుండి ప్రతిరోజూ ఒక వార్డులో పర్యటించే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పర్యటనలో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనుమతులు లేని మరియు నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలు, రహదారులు, ప్రజా స్థలాల ఆక్రమణలపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రతి కాలనీ, బస్తీ అభివృద్ధికి కృషి చేస్తామని డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి భరోసా ఇచ్చారు My-CURE అనే యాప్ ఉంటే పైన పేర్కొన్న చోట దానిని మార్చుకోగలరు.

గంజాయి మొక్కలు పెంచుతూ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థి అరెస్ట్



ముద్ర. జవహర్ నగర్ : గంజాయి మొక్కలను పెంచుతూ, ఎండు గంజాయిని అక్రమంగా సేకరించి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని ఎస్ఓటీ మల్కాజిగిరి జోన్ టీమ్–I, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. బాలాజీ నగర్‌లోని సంతోషి నగర్‌లో గల నిందితుడి నివాసంపై నిర్వహించిన తనిఖీల్లో రెండు సజీవ గంజాయి మొక్కలు, 4 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.5 వేలు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకల సాయి దినేష్ (22) అనే బీటెక్ విద్యార్థి సంతోషి నగర్‌లోని ప్లాట్ నంబర్ 117లో నివాసం ఉంటున్నాడు. గంజాయి వినియోగానికి అలవాటు పడిన అతడు, తన నివాసంలోనే రెండు అడుగుల ఎత్తు కలిగిన గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఎండు గంజాయిని సేకరించి వినియోగదారులకు డబ్బుల కోసం విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. తాను కూడా గంజాయిని వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 20న విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ, జవహర్ నగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తులు, నిందితుడు గంజాయిని ఎక్కడి నుంచి సేకరిస్తున్నాడు, ఎవరెవరికి విక్రయిస్తున్నాడు అనే కోణాల్లో పోలీసులు తదుపరి దర్యాప్తు ను ముమ్మరం చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో, మల్కాజిగిరి జోన్ డీసీపీ చి.శ్రీధర్, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదులు, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ జి. జనయ్య, వారి సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

బాచుపల్లి ఠాణాను సందర్శించిన సైబరాబాద్ సీపీ

112 ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి



ముద్ర, సైబరాబాద్, నవంబర్ 21 : డయల్ 112కు ఫిర్యాదు చేసిన బాధితుల సమస్యలు పరిష్కారమయ్యాయా లేదా అనే విషయాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన బాచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నేరాలకు సంబంధించిన వాహనాలు, వదిలివేయబడిన వాహనాల వివరాలతో ప్రత్యేక జాబితా రూపొందించాలని సూచించారు. వాటిని చట్ట నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, పురుష సిబ్బంది వసతి గృహాన్ని పరిశీలించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళా కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పాటు సమస్యల పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షణ కొనసాగించాలని ఈ సందర్భంగా సీపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్, కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ ఎ.సి. బాల గంగిరెడ్డి పాల్గొన్నారు.


ఉత్తమ వార్తా ఛాయాచిత్ర పోటీ–2026లో శ్రవణ్ కుమార్‌కు అవార్డు



ముద్ర, కూకట్‌పల్లి: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ (TSPJA) నిర్వహించిన ఉత్తమ వార్తా ఛాయాచిత్రాల పోటీ–2026లో 'నమస్తే తెలంగాణ' ఫోటోజర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో చోటుచేసుకునే మార్పులు మరియు ప్రజా సమస్యలను ఛాయాచిత్రాల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపిస్తూ, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేసే వృత్తిలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలను ప్రతిబింబించే ఉత్తమ ఛాయాచిత్రాలను అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, సీనియర్ ఫోటో జర్నలిస్టులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంజిబాబు ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ముద్ర, కూకట్‌పల్లి : సమాజ సేవా కార్యక్రమాలతో పాటు సాహిత్య, జర్నలిజం రంగాలను ప్రోత్సహిస్తున్న 'అంజిబాబు ఫౌండేషన్' కృషిని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. శనివారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీఈవో నాగుల అంజిబాబు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విద్యార్థులు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన "గురుదక్షిణ" కవితా సంకలనాన్ని నాగుల అంజిబాబు మంత్రికి బహూకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సామాజిక సేవతో పాటు ఇలాంటి సాహితీ కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న ఫౌండేషన్ చొరవను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని నాగుల అంజిబాబును ఆశీర్వదించారు.ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా విస్తరిస్తున్న నేటి రోజుల్లో రచనా నైపుణ్యాలు కలిగిన సుశిక్షితులైన జర్నలిస్టుల అవసరం ఎంతైనా ఉందని మంత్రి పేర్కొన్నారు. మంచి రచనలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని చెబుతూ, ఈ కవితా సంకలన రూపకల్పనలో కృషి చేసిన సంపాదకులు కొండూరి కోటిబాబు, ఎస్. కళ్యాణ్ దాస్, నాగుల అంజిబాబులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం సీనియర్ ఫ్యాకల్టీ, రచయిత్రి డాక్టర్ షేక్ హసీనా రచించిన పలు పుస్తకాలను కూడా మంత్రికి అందజేశారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పట్టణంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ప్రతి వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచించారు. 21వ వార్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తాయని, నేరాలు జరిగిన తర్వాత నిందితులను గుర్తించడంతో పాటు నేరాలు జరగకుండా ముందస్తుగా అరికట్టడానికి కూడా దోహదపడతాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి, వైస్ చైర్మన్ నరేష్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, కౌన్సిలర్ పబ్బ రాజమణి, ఇతర కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రం లో శనివారం శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించారు. ఆలయంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనం, వైభవ మంటపంలో సత్య నారాయణ వ్రతం నిర్వహించారు. సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే భవన సముదాయ స్థలంలో పట్టణ అధ్యక్షుడు ఎనబోయిన జహంగీర్ జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెంట నరసింహ ముదిరాజ్, జిల్లా, పట్టణ నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమాపై వార్డుల్లో అవగాహన

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై భువనగిరి పట్టణంలోని వివిధ వార్డుల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 18, 35వ వార్డుల్లో మున్సిపల్ వైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం రూ.5 లక్షల జీవిత బీమాను ఉచితంగా కల్పిస్తోందని తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని, నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు.33వ వార్డులో కౌన్సిలర్ నాకోటి నాగేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి పథకం అర్హతలు, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 22.11.2026
www.mudranews.in | @mudranews

పక్కకు తిరిగి నిద్రపోండి:

వెల్లకిలా పడుకోవడం వల్ల గురక పెరిగే అవకాశం ఉంది. కాబట్టి పక్కకు తిరిగి పడుకోవడం అలవాటు చేసుకోండి.



దీక్షా దివస్ సభకు భారీ ఏర్పాట్లు





తెలంగాణ ఉద్యమ చరిత్రలో నవంబర్ 29 కీలక మలుపు
మానకొండూరు నియోజకవర్గం నుంచి 15 వేల మందిని సమీకరించాలి
గ్రామస్థాయి కార్యాచరణకు బీఆర్ఎస్ నాయకులకు బోయినపల్లి వినోద్ కుమార్ దిశానిర్దేశం

ముద్ర, మానకొండూర్:తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో నవంబర్ 29న నిర్వహించిన దీక్షా దివస్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పి, రాష్ట్ర సాధన ఆకాంక్షను యావత్ దేశానికి చాటిన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభమైన రోజును ఉద్యమ స్ఫూర్తితో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. నవంబర్ 29న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ సభ ఏర్పాట్లపై నిర్వహించిన మానకొండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో వినోద్ కుమార్ పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సభ నిర్వహణ, జన సమీకరణ, గ్రామస్థాయి ప్రచారం, రవాణా ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు.

ఉద్యమానికి కొత్త ఊపిరి పోసిన దీక్ష

తెలంగాణ రాష్ట్రసమితి 2001లో ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర సాధనే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారని వినోద్ కుమార్ గుర్తుచేశారు. ఆర్థిక వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ గ్రామగ్రామాన పర్యటిస్తూ ప్రజల్లో తెలంగాణ ఆకాంక్షను బలంగా వినిపించారని తెలిపారు. సొంత సమయం, డబ్బు, శ్రమను ఉద్యమానికి అంకితం చేసి అనేక కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. 2009 ఎన్నికల అనంతరం తెలంగాణ ఉద్యమం అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొందని, హైదరాబాద్‌లో ఉద్యోగ నియామకాలు, పోలీసు నియామకాల్లో తెలంగాణ యువతకు న్యాయం జరగాలనే డిమాండ్లు ఉద్యమంలో ప్రధాన అంశాలుగా మారాయని వివరించారు. 14ఎఫ్ అంశంపై నెలకొన్న వివాదం కూడా తెలంగాణ సమాజంలో తీవ్ర చర్చకు దారితీసిందన్నారు. ఆ సమయంలో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవడం ఉద్యమ గమనాన్ని మార్చిందని పేర్కొన్నారు. నవంబర్ 29న ప్రారంభమైన దీక్షతో తెలంగాణ ప్రజల ఆకాంక్ష దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని తెలిపారు. కేసీఆర్ అరెస్టు, ఖమ్మం జైలు పరిణామాలు, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశాయని చెప్పారు. శ్రీకాంతాచారి వంటి యువకుల త్యాగాలు ప్రజలను తీవ్రంగా కదిలించాయని అన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయులు, కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఉద్యమంలో భాగస్వాములయ్యారని వివరించారు.

ప్రజా ఉద్యమంగా విస్తరించిన తెలంగాణ పోరాటం

2009 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన చేయడం ఉద్యమంలో కీలక పరిణామమని వినోద్ కుమార్ అన్నారు. అయితే డిసెంబర్ 23న కేంద్రం ప్రక్రియపై వెనక్కి తగ్గిన ప్రకటన చేయడంతో తెలంగాణ ప్రజల్లో నిరాశ, ఆగ్రహం వ్యక్తమయ్యాయని గుర్తుచేశారు. అనంతరం ఉద్యమం మరింత విస్తరించి రాజకీయ పార్టీల పరిధిని దాటి ప్రజా ఉద్యమంగా మారిందన్నారు.మిలియన్ మార్చ్, సాగరహారం, రైల్ రోకో, వంటావార్పు, బంద్‌లు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ ప్రజలు తమ ఐక్యతను, రాష్ట్ర సాధన ఆకాంక్షను చాటారని తెలిపారు. అనేక సంవత్సరాల పోరాటాలు, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. దీక్షా దివస్ అనేది కేవలం ఒక రోజును గుర్తుచేసుకునే కార్యక్రమం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి కార్యకర్త, విద్యార్థి, ఉద్యోగి, మహిళ, యువకుడు, ప్రజల త్యాగాలను స్మరించుకునే సందర్భమని అన్నారు. ఉద్యమ చరిత్రను నేటి తరానికి వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

ఆరు మండలాలు.. 136 గ్రామాలపై ప్రత్యేకదృష్టి

మానకొండూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు 15 వేల మందిని సభకు తరలించాలని సమావేశంలో లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం మానకొండూరు, శంకరపట్నం, తిమ్మాపూర్, బెజ్జంకి, గన్నేరువరం, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని సుమారు 136 గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నాయకులకు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వినోద్ కుమార్ సూచించారు. గ్రామాల వారీగా జన సమీకరణ బాధ్యతలను నాయకులకు అప్పగించి, ప్రజలను వ్యక్తిగతంగా కలిసి సభకు ఆహ్వానించాలని అన్నారు. గ్రామాల జనాభా, స్థానికంగా పార్టీకి ఉన్న బలం, కార్యకర్తలు, సానుభూతిపరుల సంఖ్య ఆధారంగా జన సమీకరణ లక్ష్యాలను నిర్ణయించుకోవాలని సూచించారు. పెద్ద గ్రామాల నుంచి ఎక్కువ మందిని, చిన్న గ్రామాల నుంచి తగిన సంఖ్యలో ప్రజలను తరలించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. రవాణా, ప్రచార ఏర్పాట్లపై కార్యాచరణసభకు హాజరయ్యే వారి పేర్లు, ఫోన్ నంబర్లు, ప్రయాణ ఏర్పాట్ల వివరాలతో గ్రామాల వారీగా జాబితాలు సిద్ధం చేయాలని నాయకులకు సూచించారు. ప్రజలను కేవలం సభకు ఆహ్వానించడం కాకుండా దీక్షా దివస్ చారిత్రక నేపథ్యం, తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నిరాహార దీక్ష ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. యువత ఉపాధి కోసం పట్టణాలకు, హైదరాబాద్‌కు వలస వెళ్తున్న నేపథ్యంలో గ్రామాల్లో జన సమీకరణ సవాలుతో కూడుకున్నదన్నారు. అయినప్పటికీ నిరంతర సంప్రదింపులు, గ్రామస్థాయి నాయకుల సమన్వయం, పక్కా ప్రణాళికతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు.సభకు వచ్చే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాలని, జన సమీకరణ పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సమావేశంలో చర్చించారు. సన్నాహక సమావేశంలో ముఖ్య నాయకులుఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ, పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభ నిర్వహణకు సంబంధించి గ్రామాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. మానకొండూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి నవంబర్ 29న జరిగే దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని వినోద్ కుమార్ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాట చరిత్రను గుర్తుచేసుకుంటూ, ఉద్యమంలో పాల్గొన్న వారి త్యాగాలను భావితరాలకు పరిచయం చేయాలని ఆయన కోరారు.

శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య


కార్తీక్ కుటుంబానికి న్యాయం చేయాలి
కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలి
బాధిత కుటుంబానికి అండగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్..
జాతీయ రహదారిపై 40 నిమిషాల పాటు ఆందోళన





ముద్ర, ఎల్బీనగర్: శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ బైపీసీ చదువుతున్న షేర్గూడెం గ్రామానికి చెందిన విద్యార్థి కార్తీక్ ఆత్మహత్య ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు.బొంగులూరు క్యాంపస్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్తీక్ కుటుంబంలో గృహప్రవేశ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో కళాశాలకు సెలవు లేదా అనుమతి ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరినప్పటికీ అనుమతి నిరాకరించారని కుటుంబ సభ్యులు, విద్యార్థుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. అయితే ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు అన్ని కోణాల్లో సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.బాధిత కుటుంబంతో కలిసి రోడ్డుపై బైఠాయింపు కార్తీక్ కుటుంబానికి న్యాయం చేయాలని, కళాశాల యాజమాన్యం బాధ్యతాయుతంగా స్పందించాలని డిమాండ్ చేస్తూ బొంగు వెంకటేష్ గౌడ్ విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై దాదాపు 40 నిమిషాల పాటు బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.పలు సంఘాల మద్దతు.. బాధిత కుటుంబానికి అండగా నాయకులుఈ నిరసన కార్యక్రమానికి పలు బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్, గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ న్యాయం జరిగే వరకు పోరాటానికి సహకరిస్తామని సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ.. కార్తీక్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై ఒత్తిడి, వేధింపులు లేకుండా విద్యాసంస్థల్లో పటిష్టమైన నిబంధనలు అమలు చేయాలని కోరారు.నాయకుల స్పష్టమైన హెచ్చరికఒక విద్యార్థి నిండు ప్రాణం కోల్పోవడం ఒక కుటుంబానికే కాకుండా సమాజానికే తీరని లోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రాణాల కంటే విద్యాసంస్థల నియమాలు గొప్పవి కావని, ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం, విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్, గుమ్మడవెల్లి జ్ఞానేశ్వర్, గిరిజన నాయకుడు గాంధీ నాయక్, తెలంగాణ ఉద్యమకారుడు కారి నరేంద్ర గౌడ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుడు శివ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి సంఘీభావం తెలిపారు.కార్తీక్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు.

డ్రగ్ డాన్ ఎల్ చాపో ఇసిడ్రో అరెస్ట్



ముద్ర, మెక్సికో : మెక్సికో దేశానికి చెందిన డ్రగ్ డాన్ , ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న ఎల్ చాపో ఇసిడ్రో అరెస్టయ్యాడు. మెక్సికో ప్రత్యేక భద్రతా బలగాలు, అమెరికా–మెక్సికో ఆర్మీ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో అతడు పట్టుబడినట్లు సమాచారం. ఈ సందర్భంగా మెక్సికన్ సైన్యానికి, సాయుధ మిలిటెంట్లకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నట్లు తెలిసింది. శుక్రవారం సినలోవాలో ఎల్ చాపోను పట్టుకున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నేరపూరిత కార్యకలాపాలు సాగిస్తున్న మెజా ఫ్లోరెస్ అనే సంస్థకు ఇసిడ్రో నాయకత్వం వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు తలదాచుకున్నట్లు భావిస్తున్న సినలోవాలోని గువాసేవ్ ప్రాంతంలో భద్రతాబలగాలు కాల్పులు జరుపుతున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఎల్ చాపో అరెస్టు వార్తల నేపథ్యంలో మెక్సికోలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆందోళనకారులు రోడ్లను దిగ్బంధించి వాహనాలకు నిప్పుపెట్టారు. భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు కూడా ఇసిడ్రోపై ఆరోపణలు ఉన్నాయి. మాదకద్రవ్యాల అక్రమ రవాణా ముఠాలతో సంబంధాలు పెంపొందించుకొని, ఆపై సొంతంగా ఓ ముఠా ఏర్పాటు చేసుకొని ఇసిడ్రో కీలక నాయకుడిగా ఎదిగాడు.ఇసిడ్రో అమెరికాలోకి కొకైన్, మెథాంఫెటమైన్, హెరాయిన్ లాంటి మాదక ద్రవ్యాలను చేరవేస్తున్నాడనే ఆరోపణలతో గత ఏడాది ఫిబ్రవరి 4న ఎఫ్‌బీఐ మోస్ట్ వాంటెడ్ నిందితుల జాబితాలో చేర్చింది. అతడిపై ఐదు మిలియన్ డాలర్ల రివార్డు కూడా ఉంది.

వెట్‌ల్యాండ్‌లను పరిరక్షించాలి





కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: వెట్‌ల్యాండ్ లను పరిరక్షించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. వెట్‌ల్యాండ్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని తడి భూముల (వెట్‌ల్యాండ్స్) పరిరక్షణ, అభివృద్ధి, నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.వెట్‌ల్యాండ్స్ యొక్క పర్యావరణ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వాటిని కాలుష్యం బారిన పడకుండా సంరక్షించాలని కలెక్టర్ సూచించారు.తడి భూముల ఆక్రమణలను అరికట్టడంతో పాటు, నీటి వనరుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వెట్‌ల్యాండ్స్ పరిసర ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని ఇరిగేషన్ శాఖ అధికారికి మెమో ఇవ్వాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని పై అధికారులకు రిపోర్ట్ పంపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అటవీ అధికారి జోజి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఇరిగేషన్ శాఖ అధికారులు, అటవీ శాఖ సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.పక్కడ్బందీగా జీవిత బీమా నమోదు ప్రక్రియఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఎలాంటి తప్పులకు తావులేకుండా, పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలులో భాగంగా స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.అధికారులు ప్రతి లబ్ధిదారుడి వివరాలను సంబంధిత పోర్టల్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్ కీలకమని, ఈ వివరాలను తప్పు నిసరిగా సరిచూసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, ఈడియం సందీప్ లు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం

మెదక్ జిల్లా పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, తహసిల్దార్లతో సమీక్షించారు.రోడ్డు నిర్మాణాల కోసం భూములు కోల్పోతున్న రైతులు, భూ యజమానులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణ, భూముల విలువ నిర్ధారణ, పరిహారం చెల్లింపు ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పరిహారం అందించాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులకు భూసేకరణ ప్రక్రియ కీలకమైనందున అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పనుల్లో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీవోలు రమాదేవి, భావయ్య, ఏడి సర్వే కిషన్, తహసిల్దారులు శ్రీనివాస్, కమలాద్రి, రజని, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

'పెళ్లిళ్లు చేసుకుని ఎక్కువ మంది పిల్లలను కనండి'

అమెరికా యువతకు కరోలిన్ లీవిట్ పిలుపు..!



ముద్ర, న్యూయార్క్: రానున్న పదేళ్లలో ప్రపంచంలో అతిపెద్ద మతంగా ఇస్లాం అవతరించనుందని ఇటీవల వచ్చిన ఓ నివేదికపై వైట్‌హౌస్ మాజీ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. ఈ నివేదిక నేపథ్యంలో క్రిస్టియన్ జనాభా పెరుగుదలకు సంబంధించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెళ్లిళ్లు చేసుకొని ఎక్కువ మంది పిల్లలను కనాలని అమెరికా యువతకు పిలుపునిచ్చారు. క్రైస్తవాన్ని అధిగమించి 2035 కల్లా ప్రపంచంలో అతిపెద్ద మతంగా ఇస్లాం అవతరించనుందని 'ప్యూ రిసెర్చ్ సెంటర్' అంచనా వేసింది. ఇస్లాం, క్రైస్తవం రెండు మతాల్లో జనాభా పెరుగుతున్నప్పటికీ ముస్లింల జనాభా చాలా వేగంగా పెరుగుతున్నదని ఆమె చెప్పారు. దీనికి సంబంధించి వాషింగ్టన్ పోస్ట్‌లో వచ్చిన కథానాన్ని లీవిట్ ప్రస్తావించారు. ఎక్కువ మంది పిల్లలను కనాలని అమెరికా యువతను కోరారు. పిల్లలకు అమెరికాపట్ల ప్రేమను పెంపొందించాలని సూచించారు. కాగా, కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వస్తున్నది. కొందరు నెటిజన్‌లు ఆమె అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు. మరికొందరు సోషల్ మీడియా యూజర్లు మాత్రం అమెరికాలో పెరుగుతున్న జీవనవ్యయం వల్ల యువ కుటుంబాలు ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయని కామెంట్ చేశారు. పిల్లల పోషణ భారంగా మారిందనే పిల్లలను కనడానికి యువత భయపడుతోందని పేర్కొంటున్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555